విశిష్ట

(కవితా సంపుటి)

డా॥డి.యం. రవిప్రసాద్

మైత్రేయ పబ్లికేషన్స్
వరంగల్, హైదరాబాద్
2003

Visishta
Collection of Poems
by
Dr. D.M Ravi Prasad

May - 2003

Price : 50/-

Copies :1000

ISBN : 81-900714-3-2

Maitreya Publications
1-9-252/6/A/G3, Ramnagar,
Hyderabad-500 020. Ph: +91-40-27627050
drdmrp@rediff.com

or

Dr.D.M.Ravi Prasad
University Arts and Science College
Subedari, Hanmkonda, Warangal 506 001
Cell : 9440170836
E-mail : drdmrp@yahoo.com,
website : changeology.hypermart.net

or
Sahachara Book Mark,
APHB, Shop No. 46,
Dr.B.R. Ambedkar College 'X' Road,
Baghlingampally, Hyderabad - 44.

Cover : **Ankush**
040 - 27663211

అంకితం

స్వామి ఆత్మ విజేయుడు
స్వయం సాక్షి సంభూతుడు
సర్వదా ధ్యానపరుడు
వాంకిడి గ్రామ వారసుడు
బోధి సత్వ ఆచార్యుడు
స్నేహం ప్రేమల సహచరుడు
సత్‌చిత్ ఆనందుడు

శ్రీ విజయ్ ఉప్రే గారికి

ప్రేమతో....

విశిష్ట సూచిక

1. టీ
2. విశిష్ట
3. నిర్ణయం
4. రోబోట్ అధికారి
5. గడియారం
6. భవిష్య చిత్రం
7. సర్వశ్రేయస్సు
8. కోర్టులో న్యాయం
9. భూగోళం
10. కపటం
11. అమ్మ
12. మృత్యు ముఖమున అమ్మ
13. సంక్రాంతి
15. చీకటి వెలుగుల తికమక
16. లేబర్ రూం.
17. మనసు మైలపడితే
18. మార్గాలు
19. నేను లేనిది
20. మెదడుకు ఉరేసుకున్న తనువు
21. చిరునవ్వు
22. స్నేహం
24. మనసు
25. మతోన్మాదం
26. దివ్యశక్తి
27. దీపావళి
28. ధ్యానరూపం
30. మానవత
31. పున్నమి
34. ఆధునిక కవి
36. మాస్టర్ కీ
37. మార్పుకోసం సంఘర్షణ
38. సమైక్యత 1&2
42. క్రూరుల సుఖం
43. నిలువెత్తు
44. నిన్ను నీవు తెలుసుకో
46. పాత కొత్త
47. ఆలోచనలు
49. గ్రామాలు
50. సంస్కృతి
51. వయోజన విద్యార్థులు
52. ప్రేమ మనస్సు
53. కవితా రేఖలు
54. ఉగాది
55. హౌజ్ వైఫ్
56. నిద్రరాకుంటే
57. ఎవరిదారులు వారివి
58. ఇదదే ప్రేమ
60. మధురం మానవత్వం
61. కోరికలు
62. బ్రతుకు ప్రయాణం
64. కులకంపు
65. భూమి పుష్పాలు
68. దోపిడి ఆశయం
69. వెనకబడ్డ బతుకులు
72. దళితులొస్తున్నారు
73. భారతదేశంలో
74. ప్రమయే వెలుగు
75. పడక గది
77. ఆకాశం నా ఇల్లు
78. వెలుగు VS చీకటి
79. అన్వేషణ
80. తిమిరంతో సమరం
81. టీకయ్య టీకాలు
90. మత్తయి మాన్యాలు
96. సిద్దయ్య సుద్దులు
98. నిశ్శబ్దంలో నిశబ్దం

ముందు మాట

సాహితీ మిత్రులారా!

సాహిత్యం మానవుని హృదయతత్వం. అనుభవాల పొదరిళ్ళలో మొలచిన సుగంధ పుష్పం. ఇలాగే గత పది సంవత్సరాలుగా అనగా " ఇదదే జీవితం" కవితా సంకలనం వచ్చిన తరువాత వ్రాసిన పూసిన పుష్పాలే ఈ విశిష్ట సంకలనం. నాకు ప్రియాతి ప్రియమైన గురువులు, తల్లిదండ్రులు, స్నేహితులు ఎంతో మందితో కలిగిన ప్రేమ బంధాల మరియు అనుబంధాలను ఆవిష్కరించడమే ఈ విశిష్ట సంకలన ఉద్దేశం. ఎందరో మహానుభావులు రకరకాల సంధర్భాలలో నన్ను సహించి ప్రోత్సహించి ఈ కావ్యాన్ని అచ్చువేయించే వరకు తీసుకువచ్చారు.

విశిష్ట అనేది విశ్వంలోనే ఒక ప్రత్యేకమైన పదం. ఈ పదానికి అనేక రకాల అర్థాలు ఉన్నవి. ప్రపంచంలో ప్రతీ వ్యక్తి విశిష్టమైనవాడు. విశ్వంలో ప్రతీది విశిష్ట స్వరూపం. ఇదే ఈ విశ్వం యొక్క విశిష్టత. దీన్ని అర్థం చేసుకుంటే ప్రతీవారు విశిష్టంగా బ్రతికే అవకాశం ఉంది. ఆ సమయం వస్తే మనుషులంతా చాలా సుఖంగా ఆనందంగా, ఉండగలుగుతారు. అనగా వ్యక్తి తన విశిష్టతను ఎప్పుడైతే అర్థం చేసుకుంటాడో అప్పుడే ప్రతీది విశిష్టమైనదని గ్రహిస్తాడు. ఆ గమనంలోనే గౌరవం, మర్యాద, ప్రేమ, సమభావం, సమభావన, సమానమైన సమ దృష్టి పరిణామం జరిగి, పరివర్తనల వైపు మళ్ళించి నూతన మానవత్వపు దారుల్లో ప్రగతిని సాధించే సమయం వస్తుంది. అప్పుడు ప్రపంచంలో జాతి, మత, కుల భాషా, విభేదాలు సన్నగిల్లి స్త్రీ, పురుషులు సమానమైన గౌరవంతో నూతన మానవత్వంతో బ్రతుకుతారు. ఇతరులను బ్రతకనిస్తారు. అలాంటి సమాజం రావాలని, కావాలని ఈ విశిష్ట సంకలనాన్ని శ్రద్ధా భక్తితో ధ్యానులకు మరియు జ్ఞానులకు ప్రేమతో పలకరించేవారికి, ఆనందంలో జీవించేవారికి అంకితం ఇస్తున్నాను.

విశిష్ట సంకలనం ప్రపంచంలోకి రావడానికి సహకరించిన మిత్రులు ముందుమాట వ్రాసిన శ్రీ బి.ఎస్. రాములు గారికి మరియు పెద్ది వెంకటయ్యగారికి, రచయితను పరిచయం చేసిన అన్నపూర్ణ గారికి నా కృతజ్ఞతలు మరియు ఈ సంకలనాన్ని ప్రూఫ్ రీడింగ్ చేసినటువంటి పి.సి. రాములు గారికి ఎప్పుడు ప్రోత్సహిస్తూ ఉండే సాహితీ మిత్రులు గూడ అంజయ్య, సహచర బుక్ మార్క్ వి. శంకర్ గారికి, మిత్రుడు అమర్‌సింగ్ తిలావత్ గారికి మరియు కడిదెల రామస్వామి గారికి, దుర్గం చక్రవర్తి గారికి (స్పైడ్) ఎం. ప్రకాశ్ రావు (సూపర్‌చెమ్), జి. ఉపేందర్ రెడ్డి, సి. జగన్ మోహన్, డి. రాధాక్రిష్ణయ్య గారికి మరియు స్వామి అమానోవర్తమాన్ (జయరాజు), స్వామి ఆత్మ విజయ్, దయానంద్ భారతి, స్వామి సంతోష్ మరియు మా సంధ్య, సత్సంగ్ మిత్రులందరికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

డా॥డి.యం. రవి ప్రసాద్

విశిష్ట రచయిత

డా॥ డి. యం. రవిప్రసాద్ ఎం.ఎ.,ఎం.ఫిల్; పిహెచ్‌డి., డి.లిట్(యు.ఎస్.ఎ.)భారత దేశంలోని ఆంధ్రప్రదేశ్‌లోని ఆదిలాబాద్ జిల్లా నెన్నెల మండల పరిధిలోని కోనంపేట గ్రామంలో డోలి మల్లయ్య, గంగుబాయిలకు జన్మించారు. ఆయన ఉస్మానియా యూనివర్శిటీ, హైదరాబాద్ నుండి డాక్టరేట్ తీసుకున్నారు. ప్రస్తుతం కాకతీయ యూనివర్శిటీ ఆర్ట్స్ & సైన్సు కళాశాలలో సామాజిక శాస్త్ర విభాగంలో చైర్మన్, బోర్డ్ ఆఫ్ స్టడీస్‌మరియు అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆయన '(సామాజిక శాస్త్రంలోనే) గొప్ప జ్ఞాని మరియు తత్వవేత్త. అతని ఆలోచనలు అన్నీ కూడా ఎన్నో కొత్త విషయాలు కనుక్కోవటంలో, ఎన్నో మంచి పనులు చేయుటలో చాలా చురుకుగా వ్యవహరిస్తారు. అతను సామాజిక శాస్త్రంలో చేసిన సేవ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందినది. అతను గత 20 సంవత్సరాల నుండి సామాజిక పరమైన, పరివర్తన పరమైన మరియు ప్రేమ పరమైన విషయాలలో అధ్యాపకుడిగా, మరియు పరిశోధనా కర్తగా వ్యవహరిస్తున్నారు.

అతని తండ్రిగారు హిందూ సంప్రదాయములో పేరు పొందిన యక్షగానములో సుప్రసిద్ధుడు. రవిప్రసాద్ గారు సమాజములో గల కుల మతాలపై కల వంచనను వ్యతిరేకించారు.

ఆయన గవర్నమెంట్ సిటీ కళాశాల, హైదారాబాద్‌లో చదువుకొని సామాజిక శాస్త్రంలో ఎమ్.ఎ.ని చేసుకొని హైదరాబాద్ విడిచి వచ్చారు. తరువాత ఆయన జాతీయ అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని సామాజిక శాస్త్రానికి సంబంధించిన అనేక సదస్సులను నిర్వహించారు. పరివర్తన శాస్త్రము సహస్రాబ్దిలో పరివర్తనల గురించి ఉత్సాహముతో నూతన తరానికి అందించారు.

Osho యొక్క బోధనలకు ఆకర్షితుడైనాడు. పూనాలో గలOsho ఆశ్రమమును సందర్శించారు. అక్కడ ఓశో అనుచరులు పాటించిన క్రమశిక్షణకు ఆకర్షితుడై తను కూడా ఓశో అనుచరుడిగా మారి స్వామి ధ్యాన్ అమన్ అనే పేరుతో తన కొత్త జీవితాన్ని-సమాజంలో మూఢాచారాల నిర్మూలనకు ద్యానాభివృద్ధికి అంకితం చేశారు.

అతని జీవితంలో ఏ పనిచేసినా ఒక క్రమపద్ధతిలో ఒక క్రొత్త విషయాన్ని కనుక్కోవడమే అతని గొప్పతనము. అతను సమాజంలో పరివర్తనని ఉన్న మార్పుని, మరియు ఆచారాలలో మార్పులను తీసుకురావటంలో ఆయన ప్రముఖపాత్ర వహిస్తాడు. కొత్త

సామాజంలో మానవత్వంపు మార్పులను తీసుకురావడం కోసం తన రచనల ద్వారా జీవితంను అంకితం చేయడానికి పూనుకొన్నారు.

ఆయన ఎన్నో సామాజిక సేవా సంఘాలు నెలకొల్పి విద్యార్థులకు అనాధలకు సహాయం చేసారు. ఆయన ఒక ప్రముఖకవి. ఆయన స్వచ్ఛంద సేవ సంఘాలను నెలకొల్పారు. ఆయన ఎన్నో పుస్తకాలు ప్రచురించారు. వాటిలో చేంజియాలజీ కొత్త తరానికి కొత్త శాస్త్రం (వరంగల్ మైత్రేయ ప్రచురణలు 1996)Dalit Youth a Sociological Study (New Delhi APH Corporation 1997) ఇదదే జీవితం అనే తెలుగు కవితా సంపుటి, విశిష్ఠలతో పాటు రెండు కవితా సంపుటాలు ఆంగ్లంలో Celebrating the new order సామాజిక శాస్త్రం, సామాజిక శాస్త్రం ప్రాథమిక సూత్రాలు; గ్రామీణ మరియు నగర శాస్త్రము, సామాజిక శాస్త్ర సూత్రాలు గ్రామీణ మరియు పట్టణసామాజిక శాస్త్రం. ఈ పుస్తకములు ప్రస్తుతం ప్రచురణలో ఉన్నవి. ఇవి కాక ఆయన ఎన్నో ప్రముఖ పత్రికలలో ఎన్నో ప్రచురణలు చేసారు.

చేంజియాలజీ సిద్ధాంత గ్రంధముపై D. litt (USA) అనే ప్రతిష్టాత్మకమైన అవార్డు ఆయనకు ఇచ్చారు. మరియు " The International man of the year 1997-98 " అనే అవార్డును బైబిలోగ్రఫికల్ సెంటర్ , కాంబ్రిడ్జ్ వారు ఇచ్చారు. 20 వ శతాబ్దంలోని ప్రముఖ వ్యవక్తులలో ఆయన పేరు నమోదు చేశారు. ఆయన గురించి సాహిత్య అకాడమీ వారు, New Delhi India డైరక్టరీలో నమోదు చేశారు.

ఆయన పుస్తకం Changeology ఎంతో మంది ప్రముఖుల,మరియు శాస్త్రవేత్తల దృష్టిని ప్రపంచస్థాయిలో ఆకర్శించింది. ఆయన lifeology (Anew discipline for the new generation) loveology(A new discipline for the new milleunieum),laughology (A new discipline for the new society). humanology (A new discipline for the new humanity),lightology (A dislipline for the enlightenment). మొదలైన వాటిలో లోతైన పరిశోదనలు చేశారు. ఇలా ఎన్నో వినూత్నమైన రచనలు ప్రస్తుతం ప్రచురణలో ఉన్నాయి. ఈ ప్రచురణలు సందేహం లేకుండా ప్రపంచంలో యధార్థాలు తెలుసు కోవడంలో ప్రజలకు దోహద పడుతాయి.

- యస్.పి. అన్నపూర్ణ

సార్వ జనీన విశిష్టత

భావాల్ని సాహిత్యీకరించడానికి కవిత్వం ఒక సులువైన మార్గం. కవిత్వంలో సాహిత్యం పండించి పరిణతి చెందటం సాధన ద్వారా సాధ్యం. ప్రజల నాలుకలపై నిలిచే "స్పష్టకవిత్వం" రాయడం కష్టసాధ్యం. అపుడు కవిత్వం లోలోతుల్లోకి వెళ్తే తాత్వికత నిర్దిష్టతను సంతరించుకొని తాత్వికతకూ, కవిత్వానికీ మధ్య రూపానికీ సారానికీ మధ్య సంబంధంగా పరిణతి చెందుతుంది. డి.యం. రవిప్రసాద్ గారి 'విశిష్ట' కవితా సంకలనం కవిత్వానికి తత్వానికి మధ్య గల విశిష్టతను అభివ్యక్తం చేస్తుంది.

డి.యం. రవిప్రసాద్‌గారు మౌలికంగా తత్వవేత్త. సామాజిక శాస్త్రవేత్త. ఛేంజియాలజీ (పరివర్తనా శాస్త్రం) ధ్యానం అతని తత్వశాస్త్రం. కేంబ్రిడ్జి డిక్షనరీలో "ఛేంజియాలజీ" ని అర్థశాస్త్రం, సమాజశాస్త్రం లాగా "అకాడమిక్ డిసిప్లిన్" గా ఒక ప్రత్యేక అంశంగా పేర్కొని దాని రూపకర్తగా రవిప్రసాద్ పేరు నమోదు చేశారు. ఛేంజియాలజీ అనేది దానికదే ఒక తత్వశాస్త్రం కాదు. అది సమస్త శాస్త్రాల్లోని పరిణామాలను ఒక్కచోట చేర్చి చర్చించి తిరిగి సమాజశాస్త్రాలకు క్రమాలను, ఫలాలను అందించే సమన్వయశాస్త్రం. ఛేంజియాలజీ సమగ్రమైనది అందువల్ల అది మార్క్సిజం దానిలోని గతితర్కం, చారిత్రక భౌతికవాదం కన్నా ఎన్నో రెట్లు సమగ్రమైనది. 'విశిష్ట' కవితా సంకలనం కూడా ఇదే కోవలో రూపుదిద్దుకున్నది. జీవితంలోని పలు సందర్భాల్లోని పరివర్తనల్ని అక్షరీకరించిన కవితలిందులో వున్నాయి.

"ఛేంజియాలజీ" శాస్త్ర సృష్టికర్తగా ప్రపంచవ్యాప్తంగా పలువిశ్వవిద్యాలయాల్లో అధ్యయనం చేయబడుతున్న ప్రొ॥రవిప్రసాద్ కవితలు యింత సులభశైలిలో ఉండడం కొందరికి ఆశ్చర్యం కలిగించవచ్చు. ప్రాపంచిక సత్యాలు, సామెతలుగా సుడికారాలుగా రూపొందిన క్రమం తెల్సిన వారికి ఇలా సులభంగా రాయడంలోని విశిష్టత తెలుస్తుంది.

సాహిత్యం నిర్దిష్టత నుండి సార్వజనీన సత్యాలకు విలువలకు పరిణతి చెందుతుంది. విశిష్ట కవితా సంకలనంలో నిర్దిష్ట, స్థల, కాల సందర్భాల నుండి సార్వజనీనతను సాధించే పరిణామం చూడవచ్చు. నిర్దిష్టత, విశిష్టతలనేవి పర్యాయపదాలు.

" ప్రభుత్వ అధికారులు" చుట్టూ ప్యూన్లు
పి.ఏల బలగంతో పనిముట్టులా బతికేవాడికి ఎంతో గౌరవం".

అంటూ వారి దర్పం వెనక అసలు స్వరూపాన్ని చెప్తాడు. కులమతాలు సృష్టిస్తున్న మారణహోమాన్ని కవి ఆగ్రహిస్తాడు.

" గతంలో ఐక్యతా సమైక్యత సమస్యలు లేవు.
మనిషిలో ఆ భావం నిండుగా ఉన్నందున సమస్య కాలేదు"

అని సమస్య మూలాన్ని రెండు మాటల్లో చెప్పేశాడు

" దేహం పక్షం నుండి ప్రతిపక్షమై చూశాను.
సమస్యలు పువ్వుల కవచంగా మారినవి"

అన్న కవి మాట ధ్యానంతో నిత్య చైతన్యం పొందేవారికి అనుభవమైనట్లు ఇతరులకు అర్థం కావడం కష్టమే. చాలామంది " దేహదాసు" లే ఉంటారు.

" క్రూరుడు వీరత్వం చూపి ప్రజలనెత్తురు తాగెను "
వీరత్వానికి క్రూరత్వానికి అభేదాన్ని ఆపాదించిన భావం.

"కంటికి రెప్పల ఆకాశం నాయింటి కప్పు" అనడం పేదల పక్షం వహించిన తీరిది. గడియారాన్ని " పన్నెండు ముదుల పసుపు తాడు " అని " ముంజేతి కంకణం" అని వర్ణిస్తాడు కవి.

"కపటం అనేది సమాజం అనే పదాన్ని చాకిరేవు చేసింది" అని ఒక్క మాటలో విశాలమైన అర్థాన్ని స్ఫురింపజేస్తాడు.

అమ్మ గురించి ఎంత రాసినా తక్కువే. అమ్మ అన్ని భావాలకు కుదురు. పిల్లల్లోనివన్నీ తల్లిలో చేరిపోతూ అమ్మ భావాలు నిత్య నూతనమౌతుంటాయి.

" మా అమ్మ కష్టాలకు కన్నతల్లి.
మాతండ్రికి తల్లిని మురిపించే తల్లి

"అమ్మ" మనం పడిన బాధలు
భావితరాలగాధలౌతాయని బుజ్జగించి నిద్రింపచేస్తుంది.
"ఆఖరి దినాలలో ఆలుమగలు
అనురాగ బంధాలలో తల్లీ కొడుకులు"
అంటూ అమ్మ హృదయాన్ని చక్కగా ఆవిష్కరించాడు కవి.

" లేబర్ రూం " ప్రసూతి గది గురించి కవి రాసిన కోణం శ్రమ జీవి కోణం.

'టీ' అందరూ చప్పరిస్తారు. కొందరే కృతజ్ఞతతో" కవిత రాస్తారు.

"ఏ ధ్యాని ధ్యానం నుండి ఈ విత్తనాలు మొలిచినవో "
" బతుక్కి ఆరవప్రాణమైన"

టీ గురించి కవిత రాసి చంద్రునికో నూలుపోగు సమర్పించుకున్నాడు కవి.

' మనస్సుమైలపడితే హృదయంతో ఆలోచించాలి',

"రెండు కాళ్ళు ఒకే సారి నడవవు."

"జ్ఞానానికి దారులుండవు ఎక్కడైనా ఉంటుంది".

ఎంతో గొప్ప ప్రవచనాలివి. ఇలా మనకు తెల్సిన వాటినించే కొత్త భావాలు స్ఫురింపచేయడం గొప్ప కవులు చేసేపని. జిడ్డు కృష్ణ మూర్తి సత్యాన్ని తెల్సుకోవడానికి మార్గమే లేదు అని అన్నాడు. దాన్ని ఒక్క మాటతో పూర్వ పక్షం చేస్తూ జ్ఞానానికి దారులుండవు. అది ఎక్కడైనా ఉంటుంది. అలా అనడం ద్వారా డా॥ రవిప్రసాద్ గొప్ప తాత్వికుడయ్యాడు.

" తల తనువు ఒక్కటిగా కలిపి ఉంచితే
భూలోకమే స్వర్గమై విలసిల్లుతుంది"

అన్న కవి వాక్కు కొందరికి వింతగా అన్పించవచ్చు. మెదడు తనువు కల్సిలేవా అని. కాని మీలో మీరు చూసుకొంటే తెలుస్తుంది. రెండు ఒకటిగా కల్సి ఉండడం ఎంత కష్టమో. ధ్యానం యోగం ద్వారా రెంటిని కలపడం సాధ్యమవుతుందని అనుభూతిలో జీవించిన వారికి తెలుస్తుంది.

" పూర్వం నుండి అపూర్వంగా దేశంలో విశిష్టంగా బతికినవారు"
" చిట్టెడు గింజలకు అప్పుపడి చెట్టంత జీవితాన్ని ధారపోసే వాళ్ళు"
గా మారిన భూమి పుష్పాల" బాధల్నే తన గాయాలు గా భావిస్తాడీ కవి.

" స్నేహం మానవతా హృదయాల వసంతం.
ఆంతరంగిక హస్తాల ఆశయం"

ఇలా ఏరి దాచుకోవలసిన కవితా పంక్తులు ఇందులో ఎన్నో ఉన్నాయి.

" నేను నేలపై పడుకుంటే,
ఆకాశం వెయ్యిరేకుల్తో ఆహ్వానిస్తుంది...
నేలపై పడుకుంటే నేను భూమండలమైనాను.
నాలో నేను అన్వేషిస్తే విశ్వాన్నైనాను.
సూర్య చంద్రులు నాలో చిట్టి బొమ్మలైనవి.
నేను విశ్వంలో శూన్యమైనాను"

ఈ కవితాత్మ ఎందరికందుతుందో తెలియదు. భారతీయ తాత్విక చింతన, యోగధ్యానం కేంద్రకం యీ కవితలో ఒడిసి పట్టుకున్నాడు.

నేటి కొందరు ఆధునిక కవుల పట్ల ఈ కవికి ధర్మకోపం ఉండడం సహజమే.
"గతాన్ని మాటల్నీ తలలోపులుముకొన్నవాడు. ...
పొదచుట్లూ కొట్టి వస్తువును పోస్టుమార్టం చేయువాడు. ....
ఆంగ్ల సాహిత్యాన్ని అటు యిటు సదిరి
పెంటకుప్పల్లా కవిత్వాన్ని పండించువాడు...

ప్రజా కవులమని మానవతను పాటించని వారు...
నిజానికి అబద్ధానికి మధ్య ఎత్తైన గోడకట్టి
వసంతాన్ని శిశిరంగా మార్చి వేయువారు "...

చిత్తశుద్ధి లేని కవులు ఎలా బతుకుతుంటారో ఈ కవితలో నగ్నంగా నిలబెడ్తాడు కవి.

ఆంధ్రప్రదేశ్ దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్య వేదిక వ్యవస్థాపకుల్లో (1992 జూన్) డా॥ రవి ప్రసాద్ ఒకరు. దరకమే ఐక్య వేదిక తెలుగు సామాజిక, సాహిత్య భావ జాల రంగాలలో తెచ్చిన మార్పులు మౌలికమైనవి. అందులో రవిప్రసాద్ క్రియాశీల పాత్రధారి. కాకతీయ యూనివర్శిటీ తరపున ఫిబ్రవరి 1996లో దళిత సాహిత్యంపై యుజిసి,డివిఎఎఫ్ సౌజన్యంతో జాతీయ సెమినార్ రెండు రోజుల పాటు నిర్వహించి జాతీయ స్థాయికి తెలుగు దళిత సాహిత్య చరిత్రని తీసుకెళ్లారు. అక్టోబర్ 2000లో అదే యూనివర్శిటీలో దళిత సాహిత్య సదస్సు రెండు రోజులు నిర్వహించారు. దీన్ని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ డా॥ సి. రంగరాజన్ గారు ప్రారంభించారు.

డా॥ రవిప్రసాద్ దరకమే ఐక్య వేదిక దృక్పథమైన చార్వాక, బౌద్ధ, జైన, భక్తి, సూఫి ఉద్యమాలు మొదలుకొని బుద్ధుడు, పాయసి, ఉపాలి, ఆనందుడు, అశ్వఘోషుడు, కబీరు, రవిదాసు, గురునానక్, వేమన, పోతులూరి వీర బ్రహ్మం, నారాయణ గురు, పెరియార్ రామస్వామి, సాహు మహరాజ్, డా॥బి.ఆర్.అంబేద్కర్, జాషువాలను తన వారసుడిగా స్ఫూర్తి దాతలుగా స్వీకరించారు. అందుకే శంభూకుడు, ఏకలవ్యుడు మా పూర్వీకులని సగర్వంగా ప్రకటించాడు కవి.

"ఐక్యంగా ఉంటే అణిచివేశారు అప్పుడు
సమైక్యత అంటూ మొత్తుకుంటున్నారిపుడు"

అంటూ రాజకీయాల స్వభావాన్ని స్పష్టం చేస్తాడు కవి.

" కులం కుంపటిలాగుంది
శంభూకుడి శిరస్సు వేదమై
ఏకలవ్యుడి బొటన వేలు తల రాతలు రాస్తుంది"

అంటూ స్పష్టమైన దళిత దార్శనికతను వ్యక్తం చేస్తాడు.

" ఫూలే, అంబేద్కర్, బుద్ధ దేవుని మానవతా దారుల్లో .."
కళలన్నీ.. కలాలన్నీ ఒక్కటై లేసినవి.
సమాజంలో చిక్కులను మట్టు బెట్ట.. "

అంటూ తన గమ్యాన్ని, గమనాన్ని మార్గాన్ని స్పష్టంచేస్తాడు రవి ప్రసాద్.

గతం భారం కాకూడదంటూ

" కొత్త కొవ్వొత్తిలా వెలుగుతుంది.
పాతను చూడమంటుంది.
కొత్తగా బతుకుమంటుంది".

అంటాడు కవి.

బుద్ధుడు, జిడ్డు కృష్ణమూర్తి, ఓషోరజనీష్, విపాసన ధ్యానం మొదలైన వాళ్ళంతా " ఈ క్షణంలో జీవించు" అని చెప్తారు. ఈ క్షణంలో జీవించడం అంటే నిన్నటికొరకు, రేపటి కొరకు వర్తమానాన్ని వృధా చేయకుండా జీవించడం.

" గులాబీ పువ్వును చూడు.
ఏక్షణ మైన వృధా చేస్తుందా!
ఎంత అందం, ఎన్ని పరిమళాలు, ఒక్కదినంలో.
పువ్వులా పుష్పించడం నేర్చుకో,
సూర్యునిలా ఉదయించడం నేర్చుకో',
అంటూ నిన్ను నీవుతెల్సుకో అంటాడు కవి.

గ్రామాలు " ఎప్పుడు విశ్రమించని,
ఎన్నినాళ్ళయినా సుఖమెరుగని" అని చిత్రిస్తాడు.

" కర్మం ఆచారాలు కల్పిత పురాణాలు,
భారత రామాయణాలు విష వృక్షపు చెట్లు"

అని స్పష్టంచేస్తూ మూఢ విశ్వాసాలపై గురిపెడ్తాడు కవి.

ప్రేమ వెలుగుగా జీవితంలో భాగమై ఎట్లా ప్రస్తరిస్తుందో చక్కని కవితలు రాశాడు రవి ప్రసాద్. ఏ సంస్కృతి శాశ్వతం కాదనిరవి ప్రసాద్ వేల ఏళ్ల చరిత్రను తూర్పార బట్టి చూపుతాడు కవి.

"హౌజ్ వైఫ్ " గురించి

దినమంతా గానుగెద్దులా గడుపుతుంది.
హౌజ్‌వైఫ్ అని అందంగా చెప్పుకొంటుంది".....
తలవంచుక బతుకమంది సమాజం.
తలెత్తుక తిరుగుతుంది తన తత్వం"
ఇలా ఇల్లాలి తత్వాన్ని చెప్పి అండగా నిలుస్తాడు.

దశాబ్దాలుగా సాగుతున్న ఉద్యమాల్లో (మైలు) రాళ్ళుగా మారుతున్న ఆవేదన. ' కవితా రేఖలు' రూపం తీసుకొంది.

" నేను నడుస్తున్న తోవ మోడై చిగురించడం లేదు.
మోడు దశాబ్దాలుగా పంచిన ముళ్లు గుచ్చుకుంటున్నవి.

నిరాశ చిరాయువై ఇంటి బాట వద్దంటుంది".
కొంత దూరం నడిచి వెనక్కి మళ్ళ లేని జీవితాల వ్యధ ఇది.

రవి ప్రసాద్ అన్నట్లు

"ఎవరి దారులు వారివి".
కవుల్ని చదివినపుడల్లా నేను వేరైపోతాను.
వారిదారుల్లో వారు చక్రవర్తుల్లా కనిపిస్తారు.
'పేపర్' భూమి పై ఎన్నో వ్యాసాలను సృష్టిస్తారు.
అందుకేనేను కవుల్నిచదివినపుడల్లా వేరైపోతాను".

అని ప్రజలకు దూరంగా ఉంటూ రాసే కవులకు దూరం జరిగి ప్రజల్లో చేరి పోతాడు ఈ కవి.

ఇందులో చేర్చిన చిన్న కవితలు అలిశెట్టి ప్రభాకర్ రాసిన కవితలంత సూటిగా పదునుగా ఉన్నాయి. తత్వంతోపాటు మనస్సుతత్వం కవిత్వతత్వం తెల్సిన కవి రాసిన కవితలివి. ఎంత గొప్ప భావమైనా ఎంత సులువుగా చెప్పవచ్చో వీటిలో చూడవచ్చు. అబద్ధాలు అందంగా ఉంటే నమ్ముతారు. సత్యాలు స్పష్టంగా ఉంటాయి. కబీరు, గురు రవిదాసు, వేమన, పోతులూరి వీరబ్రహ్మం, జాషువాలంత స్పష్టంగా గాఢంగా జీవితాన్ని తాత్వీకరించిన కవితల సంపుటి విశిష్ట. మహాబోధి బుద్ధుని అష్టాంగ మార్గం అతని జీవన విధానం.

తెలుగు వచన కవితా లోకంలో పులిపాటి గురుస్వామి, ఇక్బాల్‌చంద్ నూతన శతాబ్దిలో కొత్త గొంతుకతో పదాలను ఆరుద్ర పురుగుల్లా మెత్తగామలిస్తే డి.యం. రవి ప్రసాద్ మరో అడుగు ముందుకేసి మెత్తని కత్తిలా కవిత్వాన్ని తాత్వీకరించాడు. సోషియాలజీ ప్రొఫెసర్‌గానే కాకుండా కవిత్వ ప్రక్రియాలోనూ ధారాశుద్ధి కలిగిన ఈ కవితలు యువకవులకు. రాయగలమనే ఉత్సాహాన్ని విశ్వాసాన్నిస్తాయి.

ఇదదే జీవితం కవితా సంపుటిని 1991లో ప్రచురించిన తర్వాత డి.యం. రవిప్రసాద్ చాలా ఆలస్యంగా తెస్తున్న కవితాసంపుటి 'విశిష్ట'. విశిష్ట ఒక్కసారిగా కాకుండా ఒక్కొక్కటిగా అపుడపుడు మళ్ళీ మళ్ళీ చదువుకున్నపుడు అర్థవంతంగా అర్థమవుతుంది. కవిత్వంలో విశిష్ట తత్వాన్ని చెపుతున్న రవిప్రసాద్ గారి కి అభినందనలు...

- బి.ఎస్. రాములు
సామాజిక తత్వవేత్త
2-2-186/53, రామక్రిష్ణ నగర్,
బాగ్ అంబర్‌పేట్, హైదరాబాద్ -500 013.

తేది : 12-2-2003
సెల్ : 9849186025
మొబైల్ : 31036987

ఆధునిక ప్రపంచానికి మానసిక భిషక్కు....

"ఒక అందమైన పోయెం అంటే
దానికి ఒక గుండె ఉండాలి
అది కన్నీళ్ళు కార్చాలి
క్రోధాగ్నులు పుక్కిలించాలి
పీడితుల పక్షం అవలంబించి
మనిషి ఋణం తీర్చుకోవాలి
బ్రతకడానికి ఒక బురుజై మనిషి
విజయానికి జెండా అయ్ ఎగరాలి" అన్న శేషేంద్ర మాటలు డా.డి.యం. రవిప్రసాద్ గారి "విశిష్ట" కావ్యంలో ధ్వనిస్తాయి. ఆ మాటలు మనిషి జీవితాన్ని వ్యాఖ్యానిస్తాయి.

సాహిత్యలోకంలో 'కవి' అని తెలియటం ఎట్లా? 'కవి' అనే వ్యక్తి సాహిత్యంలో ఏదైనా ఒక రచన భాషా రూపంలో చేసినప్పుడు, ఆయనకు 'కవి' అనే గుర్తింపు వస్తుంది. ఆ 'కవి' కల్పన అతన్ని 'కవి' గా సహృదయులకు పరిచయం చేస్తుంది. అప్పటి నుండి ఆ కవి లోకంలో గుర్తింపు పొందుతాడు. "నాన్యషి కురుతేకావ్యం" అంటే ఋషికాని వాడు కవి కాజాలడు. ఋషులు కేవలం ద్రష్టలు మాత్రమే. దర్శనశక్తి వున్నంత మాత్రాన కవితాసృష్టి ఎట్లు జరుగుతుంది. దర్శనం వల్ల 'కవి' అవుతాడు. దర్శనమంటే విచిత్రమైన భావ, ధర్మాంశాల యొక్క తత్త్వజ్ఞానం. ఆ తత్త్వజ్ఞానం వల్లనే కవి అనే పేరు లోకంలో రూఢమైంది. దర్శన శక్తి మాత్రమే కలిగిన వశిష్టాది ఋషివర్యులు కవులు కాలేదు. భవిష్యత్ దర్శనం, వర్ణనం, వైదగ్ధ్యం తెలిసిన ఆదికవి వాల్మీకి, వ్యాసుడు మాత్రమే చరిత్రలో కవులుగా నిలదొక్కుకున్నారు. వాల్మీకి, వ్యాసుడు మాత్రమే చరిత్రలో కవులుగా నిలదొక్కుకున్నారు. వాల్మీకీ "మానిషాద ప్రతిష్ఠాంత్వాం, మగమశ్శాశ్వతీస్సమాః యత్క్రౌంచ మిధునాదేక, మవధీః కామమోహితమ్ " అను శ్లోకం వెలువడిన తరువాతనే వాల్మికీ 'కవి' గా గుర్తింపు పొందినాడు. "దర్శనాచ్ఛాదరూఢాలోనే కవి శ్రుతిః" అన్న భట్టతౌనుడి మాటలు వాల్మీకి 'కవి' గా చెప్పడానికి ఆధారకేదారంగా నిలుస్తుంది, "వర్ణనా నిపుణః కవిః" అన్నట్లుగా వారే కవి – ఏ రచనలోనైతే వర్ణనా నైపుణ్యంలో నవనవోన్మేశాన్ని ఆవిష్కరిస్తారో ఆయనే కవిగా చరిత్రలో నిలుస్తారు.

ఈ విలక్షణమైన 'విశిష్ట' కావ్యకర్త కూడా ఋషిత్వం అపూర్వ దర్శనం, వర్ణనావేశం దండిగా కలిగినవారే. రస్కిన్ అను ఆంగ్ల విమర్శకుడు "Modern Painters" లో వ్యక్తులను అయిదు రకాలుగా విభజించాడు. "Persons who see , Persons who talk, Persons who think , Persons who make, Persons who do" - అన్నట్లుగా ఈ అయిదు లక్షణాలు మా డి.యం. రవి ప్రసాద్ గారిలో నిండుగా ఉన్నాయి. కవికి దర్శనం, ప్రకటనం, సృజనం, ఆలోచన, విశ్వాసం ఉండాలి. ఈ కవికి కూడా ఉన్నాయి. గతాన్ని, వర్తమానం గూర్చి కవిత్వం అందరూ చెబుతారు. భవిష్యత్ దర్శనం చేసే క్రాంతదర్శి, ప్రజ్ఞా చక్షువు రవిప్రసాద్ గారు.

రవిప్రసాద్ గారు, వృత్తిరీత్యా సమాజశాస్త్ర ఉపన్యాసకులు, ప్రవృత్తి రీత్యా 'కవిత్వం' చదవడం, రాయడం ఆయన నైజం. ఇంతకు ముందే "ఇదదే జీవితం" అనే కవితా సంపుటిని ప్రచురించారు. ఈ 'విశిష్ట' కావ్యం ఆయన రెండో రచన. వీరు బహుముఖ ప్రజ్ఞావంతులు, స్నేహశీలి, నిగర్వి, నిరాడంబరులు, మానవతావాది. వీరు జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో

పాల్గొని ఎన్నో పత్ర సమర్పణలు చేశారు. టెక్సాస్, మెచిగన్, గ్రాండ్ రాపిడ్స్, మిడిల్‌బర్గ్, నెదర్లాండ్ నుండి అహ్వానాలను అందుకొని తెలంగాణా గౌరవాన్ని, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఔన్నత్యాన్ని నిలబెట్టిన పరిశోధకులు.

రవిప్రసాద్ గారు తన అనుభూతిలోకి వచ్చిన కవితా వస్తువుల్ని ఎన్నుకొని, తనదైన శైలిలో భావాన్ని ఆవిష్కరింపజేసి, అభివ్యక్తిలో నూత్నకాంతులు చిమ్ముతూ అలతి, అలతి పదాలతో అనల్పమైన అర్థాలను ఆవిష్కరిస్తున్నారు. ఆర్నాల్డు చెప్పినట్లుగా "జీవితాన్ని వ్యాఖ్యానించడమే కవిత్వం" అంటాడు. రవిప్రసాద్ గారు కూడా సమకాలీన రాజకీయ, సాంఘిక, మత, సాంస్కృతిక పరిస్థితులను దృష్టిలో వుంచుకొని సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి కవిత్వాన్ని ఆయుధంగా తలచి మానవుని అంతరాత్మ కేకను ప్రపంచానికి అందిస్తున్నాడు. తన కలం బలంతో జాతీనాడుల్లో కొత్త రక్తాన్ని ప్రసరింపజేస్తున్నాడు.

ప్రసాద్ గారి కవిత్వంలో 'మానవతా దృక్పథం' కన్పిస్తుంది. మానవత అంటే

"It is heard,
By every one, born be neath what ever clime
Within those bosom flows the Stream of life
Pure and unhindered" అని Goeth తెలిపాడు .

ఇంకా గ్రీకు దార్శనికుడైన ప్రోటోగోరాస్ మానవతావాద ప్రవక్తగా ప్రసిద్ధిగాంచడాని కె.ఆర్. నరసింహం తెలిపాడు అతడు ప్రపంచానికిచ్చిన "మానవుడే అన్నింటికి ప్రమాణం" (Man is the measure of every thing) అనే సందేశమే మానవతావాదానికి మూల సూత్రమని ఆయన వివరించారు. "ఆధునికాంధ్ర కవితాసమీక్ష" అనే గ్రంథంలో మానవతా వాదంలోని సామాన్య లక్షణాలను నరసింహంగారు ఇలా పేర్కొన్నారు.

1. మానవ జీవితం పవిత్రమైంది.
2. విశ్వ రహస్యాలను తెలుసుకోవడానికి మానవబుద్ధియే తగిన సాధనం.
3. మానవ ప్రవృత్తి యొక్క ఉత్కృష్టమైన కృషి మానవ సౌఖ్యాన్వేషణయే.
4. వ్యక్తి స్వాతంత్ర్యం.
5. వ్యక్తిని, పదవిని డబ్బును బట్టి కాక అందరికీ సమానన్యాయం.
6. భౌతిక సుఖాలు కోరే, అనుభవించే హక్కు అందరికీ ఉంది.

ఈ మానవతావాదానికి అరవిందుడు మార్గదర్శకులుగా నిలుస్తారు. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ కవితల్లోనూ మానవతావాదం కనిపిస్తుంది. ఆధునిక సాహిత్యానికి యుగకర్తలైన కందుకూరి, గురజాడ కవిత్వంలోనూ మానవత్వం దీపస్తంభం వలే నిలిచినాయి.

ఈనాడు అభ్యుదయ కవిత్వంలోనూ నయాగార కవిత్వంలోనూ, చేతనావర్తకవుల్లోనూ, స్త్రీవాద, దళితకవిత్వంలోనూ, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి మధురాంతకం కథల్లో మానవతావాదం దండిగా కనిపిస్తుంది.

"నదులు కవులు భూగోళపు రక్తనాళాలు
నదులు ప్రవహిస్తున్నాయి కవితల్లా
పక్షులకోసం, పశువులకోసం, మనుష్యుల కోసం
నదులు కంటున్న కలలు పొలాల్లో ఫలిస్తాయి
కవులు కంటున్న కలలు మనుషుల్లో ఫలిస్తాయి" అని అంటున్న శేషేంద్ర కవిత్వంలోనూ, సి.నా.రే, దాశరథి, కాళోజీ కవిత్వంలోనూ, "రంగు మార్చడం ఎవడిక్కావాలి - అంతరంగంలో మార్పు రావాలే" అంటున్న పేర్వారం జగన్నాథం గారి కవిత్వంలోనూ అనుమాండ్ల మాదిరాజు

రంగా రావు, సుప్రసన్న, అనుమాండ్ల భూమయ్య, బన్న అయిలయ్య, లింగంపల్లి రామచంద్రం, పెద్ది వెంకటయ్య కవిత్వంలోనూ మానవతాకవిత్వం కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో డా.డి.యం. రవిప్రసాద్ గారి కవిత్వంలో 'మానవతా' కవిత్వం బోలెడు కనిపిస్తుంది.

ఈ "విశిష్ట" కవితా సంపుటిలో ఎనభైఆరు కవితలున్నాయి. వీటిలో ముప్పై మూడు మినీ కవిత్వానికి సంబంధించినవి ఉన్నాయి. ఈ మినీ కవిత్వానికి "టీకయ్య టీకాలు" అని రచయిత శబ్దస్వారస్యాన్ని ఉట్టిపడేట్లుగా శిల్పించినారు. రవిప్రసాద్ సృజించిన ఈ కవితలన్నింటిలో మానవ జీవితాన్ని అనేక కోణాల నుండి పరిశీలించి, మానవ అభ్యుదయం కోసం పాటుపడిన తీరు, తన సునిశితమైన పరిశీలనతో ఆరోగ్యప్రదమైన క్రొంగొత్త సమాజాన్ని ఆవిష్కరించాలనే జిజ్ఞాస అవగతమౌతుంది. అంతేగాకుండా రవిప్రసాద్ గారి నాయకత్వంలో లోతైన భావుకత, చక్కని కవితాత్మ, మానవీయ సంబంధాలు చిగురెత్తాలనే తపన, సమైక్య నినాదం కోసం ఆరాటం, దేశభక్తి పూరిత ధంకానాదాలు, కుహనరాజకీయ నాయకుల చేష్టల్ని అధిక్షేపంలో తిట్టిన తీరునూ, సమ సమాజస్థాపన, శ్రామికుల పాలిట పక్షపాతిగా నిలిచిన తీరు ప్రతి కవితలో ప్రతిధ్వనిస్తుంది. ఆలోచింపజేస్తుంది.

డా॥ రవిప్రసాద్ గారు ఈ కవితా సంపుటికి "విశిష్ట" అని నామకరణం చేశారు. "విశిష్ట" అంటే కూడుకొన్నది. మిక్కిలి శిష్టమైనదని అర్థం. "ఇది ఇహపరాలలో విశిష్టమైనదని, నూతన పరివర్తనాలలో సుప్రభాతమని, ప్రకృతికి ప్రాణం దీని దేహమని, నిరాకర నిషబ్ద విశిష్ట గమ్యం" మని కవి తెల్పడం వలన ఆయన చిత్తవృత్తి ఆవిష్కరించబడుతుంది. "ప్రతిజీవికి విశ్వ అధికారాలను ఇస్తుందని "కవి అభివ్యక్తిలో సామ్యవాదం వస్తుందని, సమసమాజం ఏర్పడుతుందని అందరు సమానంగా వుంటారని ఆశించడం ఆయన ప్రగతిశీలమైన వ్యక్తిత్వాన్ని ఈ కవిత ధ్వనింపజేస్తుంది.

కవి సృజనాత్మక శక్తికి ప్రమాణంగా నిలిచే కవిత 'దోపిడి ఆశయం' రచయిత తాత్విక దృష్టికి కేతనంగా ఈ కవిత నిలుస్తుంది. శ్రమజీవుల పట్ల ఆయనకున్న అభిమానం సాక్షాత్కరిస్తుంది.

"మా చెమటే / మా ఆస్తిగా ఎన్నుకుంటే / మా రక్తనాళాలే /
మీకు ఉరితాళ్ళవుతాయి / మా శ్రమ దోచుకోవడం /
మీ పని అయితే / మిమ్ము సమాధి చేయడం /
మా ధ్యేయమౌతుంది" - అన్న వాక్యాలు ఆయన కవితా తత్త్వం.

ఈ చెమటనే అభ్యుదయ కవులు, విప్లవకవులు, దళిత కవులు శ్రమకు ప్రతీకగా తీసుకున్నారు. శ్రమజీవుల పక్షపాతిగా నిలిచారు. శ్రీశ్రీ గారు చెప్పినట్లుగా శ్రమైక జీవన సౌందర్యానికి, కార్మిక లోకపు కల్యాణానికి, శ్రామిక లోకపు సౌభాగ్యానికి సమర్పణం అంటాడు. సమర్పణ అనగా త్రికాలలో శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని, కార్మికులకు, శ్రామికులకు, ప్రగతి మార్గాన్ని చూపిస్తే లోకానికి వినిపిస్తామని శ్రీశ్రీ చెప్పారు. రవిప్రసాద్ గారు కూడా శ్రమ దోపిడికి గురైతే కార్మికులంతా కలిసి సమాధులే నిర్మిస్తారని బడాబాబులకు హెచ్చరిక చేయడం ఎంతో బాగుంది. ఈ కవిత్వంలో కవి మానవ జాతి సుఖాన్ని, శాంతిని కోరినతీరు ఆయనకు శ్రమజీవుల విలువ తెలిసిన వ్యక్తియే కాకుండా క్షుదాగ్నుల పాలిట శక్తిగా కన్పిస్తున్నారు.

రవిప్రసాద్ గారి "మార్గాలు" అనే కవితలో వేరువేరు మార్గాల్లో జీవనం సాగించే మనుష్యుల ప్రవర్తనను అక్షరమాలలో శిల్పించిన తీరు చూడండి.

"అగ్నిలా బ్రతికే వారికే శరణం అరణ్యమే
కొందరు అరచేతిగీతలపై నడుస్తారు
అదృష్టరేఖల చాటున దొడ్డిదారిన బ్రతుకుతారు

బల్లక్రింద చేతులు పెట్టి ఏమేమో వెతుకుతారు" అన్న పంక్తుల్లో కవి నేటి సమాజవాస్తవ చిత్రణకు అద్దం పడతుంది. "యదార్థవాది లోక విరోది" అన్నట్లుగా సమాజంలోని కుళ్ళును తనకళ్ళతో ప్రశ్నించే వాడిపైన ప్రభుత్వం నిఘావేస్తుంది. తన హక్కులకు భంగం కలిగినప్పుడు ఎదురు తిరిగి ప్రశ్నిస్తే విప్లవకారుడని ముద్రవేస్తున్నారు. ఈ మనిషే సంఘంలో నివసించకుండా అరణ్యంలో నివసిస్తున్నాడనేనే కవి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇంకా కొందరు దొడ్డిదారిన బ్రతుకుతున్నారని, వారి మార్గాలలో మార్పురాకపోతే మనుషులంతా కలసి వాళ్ళను మార్చాల్సివస్తుందని హెచ్చరిక చేసిన తీరు కవి అభ్యుద దృక్పథం ఆదర్శవాదం అద్భుతమని తెలుస్తుంది.

'చిరునవ్వు' కవితలో నవ్వు మనిషికి టానిక్ లాంటిదని తెల్పినారు. 'దీపావళి' కవితలో ఉన్నవాడి – లేనివాడి స్థితిగతుల అక్షరరూపం. ఈ 'దీపావళి' ఉన్నవాడి పండుగంటూ – ఏదో ఒక రూపంలో ఉన్నవాడికే లాభం 'లేనివాడికి ప్రతిదినం శివరాత్రితో సమానం' అంటూ కవి వ్యక్తీకరించిన తీరు యధార్థమైంది.

రవిప్రసాద్ 'కులకంపు' కవితలో మానవత ఎక్కడుంది. అని ప్రశ్నిస్తున్నారు. సభ్యసమాజాన్ని విమర్శించిన తీరు చూడండి.

"నాల్గు దిక్కుల్నుండి చతుర్వర్ణం మనుషుల్ని చుట్టుకుంది
కత్తులతో గొడ్డళ్ళతో మానవతను నరికింది
సంచులలో శవాలు నింపి
కాకులకు, గద్దలకు ఊరు అప్పగించింది
అగ్రవర్ణం పోలీసులు ఒక్కటైనా
కులతత్త్వం క్రూరంగా సకిలించింది
మానవతను మంటగలుప మరో ప్రయత్నం చేసింది.
అసెంబ్లీ పార్టమెంటుల నోర్లు అరుస్తున్నవి
ప్రతిపక్షాలు న్యూస్ పేపర్లు కేకలేస్తున్నాయి
రాజకీయ ముసుగులో కులకంపు కొడుతుంది" –

అంటున్న రవిప్రసాద్ గారి సమాజ వాస్తవ చిత్రాలను కళ్ళకు కట్టినట్లు వివరించారు. మనిషి మనిషిలో మానవత నశించి దానవత పంజా విప్పుతుందని, కులం పేరుతో, మతం పేరుతో మనిషి-మనిషిని వేరుచేస్తున్నారని అగ్రవర్ణాల అగచాట్లను కవి నిరసిస్తున్నారు. రాజకీయ చదరంగములో వారిబిడ్డలు అగ్రవర్ణాల దౌష్ట్యాలకు గురియై, బలైపోతున్నారని, ఈ కులం కంపును చూసి కొత్తతరం నవ్వుతుందని మనిషి-మనిషిలో మానవత ఎక్కడుందని కవి ప్రశ్నిస్తున్నాడు. కులం కంపు దేశంలో ఇలా కొనసాగితే నాశనం తప్పదనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కులకంపు 'రావణాకాష్టం' లా కొనసాగితే వంకరజాతులలో కులం తన సమాధి కట్టుకుంటుంది. అనే రచయిత హెచ్చరించిన తీరు ఆయన సమతావాదానికి నిదర్శనంగా నిలుస్తుంది.

రవిప్రసాద్ గారి మరో కవిత 'భవిష్యచిత్రం'. ఈ కవిత ఆయన దర్శనానికి ప్రతీకగా నిలుస్తుంది. నైతిక విలువలతో జాతి నశించిపోతున్న వర్తమానాన్ని చూచి కవి తన తీవ్రమైన అంతర్వేదనను వ్యక్తం చేస్తారు. ఈ కవితకూ ఆ ఆవేదన ప్రాణంసంవేదన అవుతుంది.

"గుడిసెలకు బోర్డులు పెట్టి మురిసిపోయే నాయకులున్నారు
రంగు రంగు జెండాల్తో రక్తాన్ని త్రాగుతున్నారు
మాస్ మీడియా కూడా తోడున్నారు
గుడిసెలు లేవకుండా భవనాలు లేపుతున్నారు

మూలకొక్క దేవున్ని పెట్టి మూఢత్వాన్ని పెంచుతున్నారు
వైరుధ్యాలతో మనిషిని సతమతం చేస్తున్నారు"

ప్రసాద్‌గారు పై కవితలో ఊసరవెళ్ళి నాయకుల నైజాన్ని తూర్పారబట్టారు. రాజకీయ నాయకులు వైరుధ్యాలతో మనిషి మనిషిని వేరుచేస్తే బాగుండదని 'ఖబద్దార్' అని హెచ్చరిస్తూ, అణచబడ్డ శక్తులన్ని ఆయుధాలుగా లేస్తారని, వాళ్ళ పునాదుల్ని కదిలిస్తారని హితబోధ చేసిన తీరు ఆయన సమసమాజ స్థాపనమనే దృష్టి తెలుస్తుంది. ఇంకా ఈ వ్యక్తులే సౌరశక్తులుగా భారతంలో దీపస్తంభాలుగా వెలుగుతారని, మనిషిని మనిషి గౌరవించే రోజు వస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తంచేయడం ఆయనకు మనిషిపైన ఉన్న ప్రగాఢమైన నమ్మకం వ్యక్తమౌతుంది.

ఈ రవిప్రసాద్ గారి మరో మంచికవిత "సంస్కృతి" భారతీయ సంస్కృతి ప్రభావాన్ని గొంతెత్తి పాడుతాడు. మెకాలే పాశ్చాత్య విద్య భారతీయుల విద్యపై ప్రభావాన్ని చూపుతుంది. నల్లవాన్ని తెల్లవానిగా మార్చాలని మెకాలె ప్రయత్నిస్తే, తెల్లవాని విద్యతో నల్లవాడు ఆంగ్లవిద్యను అభ్యసించి, భావసమైక్యతనూ, తమ దేశచరిత్ర సంస్కృతి తెలుసుకోవడంలో తమలో జాతీయభావం అంకురించి స్వాతంత్ర్యం సంపాదించడానికి ఇంగ్లీష్ భాష ఉపయోగపడింది. ఏ వ్యవస్థ మన పునాదుల్ని కదిలించలేకపోయింది. రచయిత చారిత్రిక నేపథ్యంలో మన సంస్కృతి పైన కవిత్వం రాసి ప్రతివారి కళ్ళు తెరపించే భావి కవిత ఉదాత్తమైంది. ఈ కవితే చూడండి.

ఏ సంస్కృతిని / ఈ వ్యవస్థ అణగద్రొక్కాలనుకుందో
ఈ సంస్కృతే
ఈ వ్యవస్థను మార్చి వేసింది

"అన్న పంక్తుల్లో కవికి స్వదేశంపై వున్న అనూహ్యమైన ప్రేమను చాటుతుంది. మన ఆచారవ్యవహారాలు, మన కట్టు, బొట్టు, మన నడవడిక ఉదాత్తమైనదని తెలుపడం ఆయన మన దేశంపై ఉన్న భక్తికి అక్షరరూపం ఈ కవిత".

మా అమ్మ
కష్టాలకు కన్న తల్లి

మా తండ్రికి / తల్లిని మరిపించే తల్లి" అన్న కవిగారి మాటల్లో "అమ్మ" విశాలతత్త్వం, ఆప్యాయత తెలుస్తుంది. ఉగ్గుపాలను కలిపినట్లుగా పెరగన్నం తినిపించేదని, మనం పడిన బాధలే భావితరాలకు గాథలైతాయని చాటిన తన తల్లి స్మృతిని నెమరువేసుకుంటూ 'అమ్మ' ఔన్నత్యాన్ని నిలువెత్తుగా చిత్రించిన తీరు, శ్రమలోనే సౌందర్యం ఉన్నదన్న సత్యాన్ని తెలుసుకొని, ఈనాటి సమాజానికి రచయిత కళ్ళు తెరిపించేలా 'అమ్మ' కవితను తెలిపిన తీరు బాగుంది.

"వచ్చిపోయే అతిథులకు శిలలేసోపానాలు
స్నానమాడే సముద్రాల ఏరుల్లో బాత్రూములు
నాలుగు దిక్కులు నా ఇంటి స్తంభాలు
భూమిపై పుట్టి ఆకాశానికెదిగిన నేను విశ్వమానవుడను"

– ఈ ఆకారం నాయిల్లు అనే కవితలో ఆయన విశ్వనరుడిగా ఎదిగిన తీరు తెలుస్తుంది.

"బ్రతుక్కి ఆరవ ప్రాణమై / సర్వరోగ నివారిణియై
భాధల బంధీలకు విముక్తి కలిగిస్తుంది".

ఈ కవితలో వస్తువు "టి". శ్రీశ్రీగారన్నట్లు కుక్కపిల్లా, సబ్బుబిల్లా, అగ్గిపుల్లా, అంతా కవితామయమేనోయ్ అని నిర్వచించారు. రవిప్రసాద్ గారు కూడా ఈ 'టి' త్రాగకపోతే ప్రాణం నిలువదని, పెన్సిల్ మందు సర్వరోగ నివారిణి అన్నట్లుగా, ఈ 'టి' అనేది ఆస్వాదిస్తే అన్ని బాధలు దూరమైపోతాయని, ఆయన అనుభవించిన తీరు అలతి అలతి పదాలతో అనల్పమైన అర్థాలను స్ఫురించేలాగ అభివ్యక్తం చేయడం హర్షించదగ్గ విషయం.

నిజాయితి అనే "అనే కవితలో" "హంగుల్లో నిజాయితీ వెలుగుతూ వుంటుంది. నిజాయితిలో నిజమైతే కనిపిస్తూ వుంటుంది." అన్న మాటల్లో ఏ వ్యక్తినైనా నిజాయితి వుంటేనే సమాజం బాగుపడుతుందని, ఆయన ఆవేదనను వ్యక్తం చేస్తారు.

ఈ కవిత్వంలో "టీకయ్య టీకాలు" - వాచ్యార్థం. వ్యంగ్యార్థం, లక్ష్యార్థం బోధపడుతుంది. జగన్నాథ పండితరాయలు రమణీయార్థ ప్రతిపాదకఃశబ్దఃకావ్య మన్నట్లుటగా రవిప్రసాద్ గారు రమణీయమైన శబ్దాలతో, అర్థాలతో శబ్దస్వారస్యానికి పట్టం గట్టిన తీరు కన్పిస్తుంది.

"మనుష్యుల్ని వేరుచేసి / మానవులకు కులం పూసి
కులం పేరుతో బలహీనుల్ని చేసి / బలహీనులపై
ఆధారపడి బ్రతుకువాడు" అన్న కవితలో ఈడియట్ వ్యక్తిత్వాన్ని సహజంగా చిత్రించిన తీరు తెలుస్తుంది.

'నర్సులు' అనే శ్రీర్షికలో తెల్లకొంగల్లా రోగాల సరస్సులోని పక్షులు / అంటూ కవి నర్సుల సేవాదృక్పథాన్ని కొనియాడిన తీరును దర్శింపజేసినారు.

" మనస్సులేని శరీరంపై మమకారం /
దేహాన్ని ఆత్మదేహి అనుగుణం " - అన్న కవితలో వ్యభిచారి బ్రతుకడం కోసం తన శరీరాన్ని అమ్మిన తీరు, ఆమె ప్రవర్తననూ సహజంగా చిత్రించినారు.

ఈ మినీ కవిత్వం, అనగానే "The terrible brevity of life could demand more brevity of language", "Poets are men who refuse to utilize language" అనే మాటలు గుర్తొస్తాయి. Free vers లో స్పష్టత అనవసరమైన పొడిగింపు ఎక్కువవుతున్న రోజుల్లో ఈ మిని కవిత్వం ఆవిర్భవించింది. ఈ కవిత్వం 1978-85 ల మధ్య బాగా వెలువడి కొత్తగొంతుల్లో సరికొత్త విలువల్ని ప్రోదిచేసిందని చెప్పవచ్చును. వచనా కవితా యౌవనరూపం - మినీకవిత్వమని అద్దేపల్లి రామమోహన్ రావు అంటే, టి.ఎల్.కాంతారావు వచన కవితకు సంక్షిప్త రూపమే ఈ మినీకవిత' అన్నారు.

రవిప్రసాద్ గారు మినీకవిత్వంలో ఉచ్ఛ్వాసం క్లుప్త నిశ్వాసం ధ్వనిగా ప్రతి ధ్వనిస్తాయి.

వర్తమానంలో మానవత్వం నశించిదనీ, పశుత్వమే ప్రళయరూపం దాల్చుతుందనీ చెప్పడానికి ఈ క్రింది పంక్తుల్లో చెప్పిన కవిత ఇది.

"మగ అహంకారంతో / మగువలను అణచేసి
కట్నాల కానుకలతో బ్రతుకుతున్నారు / భాడ్‌కావ్ అంటే భయమేలనోయ్"
అన్న పురుషాహంకారాన్ని వ్యక్తపరిచేది.

తృప్తి జీవితంలో ఆనందాన్ని ఇస్తుంది. జీవితంలో తృప్తి లేని బ్రతుకులను, నైతిక విలువల్ని మరిచిపోయి ప్రవర్తించే వింత మనుషుల్ని ఈ కవితలో చిత్రించారు.

"ఎన్ని ఉన్నా / తృప్తిగా బ్రతకని వారు
పైసా కొరకు / పది అబద్ధాలు ఆడువారు" అని కవి వాచికం ఈనాటి సమాజానికి ప్రతీకగా నిలుస్తుంది.

దవాఖానా పేరుతో చికిత్సకులు చేస్తున్న మోసాలను, వాస్తవ చిత్రణను దర్శింపజేసే కవితే ఇది ....

"మనుష్యులకు అంటుకొనిన రోగాలు
గాయాలు మందులతో కప్పిపుచ్చు చికిత్సలు
మనిషిని అమాంతం తినివేయు కేంద్రాలు" అంటారు.

వర్తమానంలో డాక్టర్లు డబ్బు సంపాదనే ధ్యేయంగా ప్రవర్తిస్తున్నారని, మానవీయ విలువల్ని మంటగలుపుతున్నారని తన అనుభూతిని, ఆవేదననూ అభివ్యక్తం చేసే చక్కని కవిత.

"ఆరోగ్యమేమిటో తెలువని అజ్ఞానులు
రోగాలు విసుగులో మానవత్వం కసిగా బ్రతుకుతారు
రోగాభివృద్ధికి క్లినిక్కుల దుకాన్లు పెడతారు
రోగాలు లేకుంటే నిరుద్యోగుల్లా రోడ్లపై పడతారు" అని డాక్టర్ల నీచప్రవృత్తిని దుయ్యపడుతున్న తీరు వాస్తవానికి ప్రతీకగా నిలుస్తుంది. రవిప్రసాద్ గారు సమాజశాస్త్రంలో "దళిత యువత" ప్రామాణికమైన సిద్ధాంత వ్యాసం రాసి ఉస్మానియా యూనివర్సిటీ నుండి పి.హెచ్.డి పట్టా తీసుకున్నారు.

ఒక తాత్త్వికునిగా పరిశోధకునిగా, విమర్శకునిగా, బోధకునిగా ఆయన ప్రవృత్తిని దర్శింపజేస్తే, ఆయన ఆలోచనం, సృజనాశక్తి, దర్శనం, వర్ణనం, ప్రకటనం, విశ్వాసం ఇన్ని శక్తులు సంగమమై ఉత్తమ కవిగా నిలువడానికి కార్యకారణమైనవి.

రవిప్రసాద్ ఈ 'భాషా' మినీకవిత్వంలో భాష - భాషం వ్యక్తిత్వాలను ముడివేస్తుందని శక్తివంతంగా చెప్పారు. మనస్సు - మనస్సును కలిపేదే అసలైన భాషయని భాష్యం చెప్పిన తీరు అవగతమౌతుంది.

"భాష మాటల సుడిగొడుతుంది
భావం హృదయ తరంగాలది
భాషా భావం వ్యక్తిత్వాలను పురికొల్పేది"

అని కవి తెలుపడం వాస్తవమైంది. వీరు బహుముఖ ప్రజ్ఞావంతులని తెలుస్తుంది. ఆంగ్లంలో కవిత్వం, తెలుగులో స్వచ్ఛమైన కవిత్వం రాసిన తీరును చూస్తే ఆయనకు భాషపై ఉన్న మమకారం తెలుస్తుంది.

మొత్తం మీద రవిప్రసాద్ గారు ఈ "విశిష్ట" కావ్యంలో విలక్షణమైన భావాలతో సమాజానికి గొడుగుగా నిలిచిన తీరు, ఆయన జాతీయ సమైక్యత నినాదం, విశ్వ శ్రేయస్సునూ ఆకాంక్షించే మానవీయమూర్తిగా, ప్రగతిశీల ప్రభంజనంగా సామాజిక చైతన్యం ఊర్పుగా, సమసమాజస్థాపన తీర్పుగా, స్త్రీ జనోద్ధరణమే ధ్యేయంగా, సామాజిక స్పృహ అంతర్మధనంగా వీరి కవిత్వం సాగింది.

'కాదేది కవితకనర్హం' అన్నట్లుగా రవిప్రసాద్ గారు స్వీకరించని కవితా వస్తువులేదు. ఆయన భావుకత, పదప్రయోగం ఆయన వ్యక్తిత్వాన్ని చూపుతాయి. ఏ కవిత్వాన్ని చదివినా అది శబ్దాలను ఏర్చికూర్చినట్లుగా కాకుండా హృదయకుహరంలో నుంచి పొర్లి స్రవంతికలా వుంటుంది.

రవిప్రసాద్ గారి జీవితాన్ని విడదీసి చూడడం చాలా కష్టం. ఆయన అనుభూతి, ఆవేదనల వ్యక్తీకరణమే రవిప్రసాద్ గారి కవిత్వం. ఈయన కవిత్వంలో ఎక్కడా అస్పష్టత, సంక్లిష్టత కానీ కన్పించదు. సరళంగా, సుబోధకంగా ఈ 'విశిష్ట' కావ్య నిర్మాణం జరిగింది.

డా॥ రవిప్రసాద్ గారు నన్ను మొదటగా ప్రూఫు రీడింగు చూడమని, ఆ తర్వాత ఈ కావ్యానికి ముందుమాట రాయమని కోరినప్పుడు భయపడ్డాను. నాకు రవిప్రసాద్ గారితో ఉన్న స్నేహం నన్ను ఈ కావ్యానికి ముందుమాట రాయించింది. ఆయనకు నా ధన్యవాదాలు. ఈ కావ్యం వర్తమాన కవిత్వానికి దీపస్తంభంలా నిలుస్తుంది.

- డా॥ పెద్ది వెంకటయ్య
తెలుగు లెక్చరర్
ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల
కాకతీయ విశ్వవిద్యాలయం - హన్మకొండ

టీ

ఎవరి కంటి నీరు
ఎందరి కళ్ళ నీళ్ళు తుడవ వచ్చెనో
ఏ ధ్యాని ధ్యానం నుండి
ఈ విత్తనాలు మొలచినవో
ఏ ఉనికి నుండి
ఈ ఉత్పత్తి వస్తుందో

భూమిపై ప్రజలకు వరమై
ప్రకృతిలో సహజంగా ఎదుగుతుంది
వ్యక్తిలోని శక్తుల్ని పురి కొల్పుతుంది
అగ్నిలాంటి ఆకలిని ఆర్పేస్తుంది
అగమ్య గోచరంలో
అంధుడికి చేతి కర్రలా ఉంటుంది

సృజనులకు స్ఫూర్తిదాయకమై
నూతన ప్రక్రియలకు నిలయమౌతుంది
సజనులకు స్నేహమై
పూదండలో దారంలా మమేకమౌతుంది
మేధావులకు మేతావులకు
ఆశు కవిత్వంలా, వికసించిన పరిమళమౌతుంది

బ్రతుక్కి ఆరవ ప్రాణమై
సర్వ రోగ నివారిణియై
బాధల బంధీలకు విముక్తి కలిగిస్తుంది
జగతిలో ధ్యానంలా దివ్వెలా వెలుగుతుంది

విశిష్ట

విశిష్టత
సాకారంగా
విశ్వంతరాల్లో
నెలకొని ఉంది
ఉదయం నుండి
మరో ఉదయానికి
పూదండలో దారంలా
తన కర్తవ్యాన్ని నిర్వహిస్తుంది
విశిష్టత సృజనాత్మకతలో
క్షణక్షణం పరివర్తన మానమై
ప్రపంచంలో నూతనత్వమౌతుంది
విశిష్టత మూర్తి మత్వమై నిలుస్తుంది.
విశిష్టత విరాట్ రూపంలో
విశ్వంలో వికసిస్తుంది
ప్రతివారి వ్యక్తిత్వంలో
ప్రత్యేకతలని చూపుతుంది
చావు పుట్టుకల మధ్య
విశిష్టత సంతరించుకొంది
మరణం తర్వాత అమరమౌతుంది
అనంతంలో తనంతట తానై ఉంది
అవగాహనలో అర్థం
స్ఫూర్తిలో సూక్ష్మం
కల్పనలో సాక్ష్యం
శ్రమలో పరమార్థం

నిర్ణయం

దినం ఎరువేసిన ఎడారిలా ఉంది
రాత్రి, వెన్నెల గాచిన అడవిలా ఉంది
బ్రతుకులో దినాలు అలా గడిచిపోతున్నవి
మధ్యరాత్రి నిద్ర కూడా వదిలిపోతున్నది
వెలుగులో ఈదడానికి చేతులు కాళ్ళు కొట్టుకుంటున్నవి
చీకట్లో కళ్ళు వెలుగును వెతుకుతున్నవి
కుల మతాలు ముందే పేరు పెట్టుకున్నవి
నాలోని నన్ను చంపి నాపై అధికారం చెలాయిస్తున్నవి
ఆధునికతని రమ్మని మానవత్వం పంపించింది
మార్పు ప్రగతులను చూస్తే గుండె లయతప్పుతుంది
క్షణం క్షణం తల్లడిల్లే బ్రతుకు బరువైపోయింది
నాలుగు తోవల మధ్య మనుసు నలిగిపోయింది
నాలోనే ఏదో అలసత్వం మొదటి నుండి పెరుగుతోంది
నేనే ఒక నిర్ణయం నేడే తీసుకోవాల్సి ఉంది
ఆలోచన్ల కుంపటిలా మెదడు మండిపోతున్నది
అగ్నిలాగా ఒక్కసారి పైకి ఎగరాలని ఉంది
ఇక్కడ నుండే ఇప్పుడే

రోబోట్ అధికారి

కుర్చీలో మనిషిలా జంతువు
నోరు నిండా రాళ్ళలాంటి రూల్స్
చట్టం గొలుసులతో ఉరివేసుకున్న పురుగు
తూర్పును చూస్తూ పడమరకే నడుస్తుంటాడు

ఫైల్లపై రోడ్డు రోలర్‌లా సంతకిస్తాడు
కాటి కాపరిలా కార్యాలయాన్ని కాస్తాడు
రూల్స్‌లో మార్పు రాకుండా భజనలు చేస్తాడు
పుట్టుగుడ్డివానిలా లోకాన్ని చూస్తాడు

శాసనాల చక్రంలో పని ముట్టయి
యంత్రంతో యంత్రంలా కుస్తీ పడతాడు
మధువుతో మదన పడతాడు
గానుగెద్దులా బ్రతుకుంతా గడుపుతాడు

చుట్టూ ప్యూన్ల, పి.ఏ.ల బలగం
పనిముట్టులా బతికే వాడికి ఎంతో గౌరవం
అధికారాన్ని "అభివృద్ధి" పేరుతో చెలాయిస్తాడు
సత్కారాల కొరకు భజన పరులతో కులుకుతాడు

బ్యూరోక్రసీలో సర్జరీ కేసు ఇది
పేపరు వెయిట్ అధికారాల్లో అడ్మినిస్ట్రేషన్ నడిపించి
అధికార అహంకారాల్లో బతుకు హిపోక్రాట్లు
ఇలాంటి రోబోట్‌కు కుర్చీ వేయడం ప్రగతికి చేటు

గడియారం

పన్నెండు ముదుల పసుపుతాడు
ముదులను ముద్దెట్టు గంట కుందేలు
గుండ్రని విశ్వంలో సమ్మెట పోటు
మనిషిని నడిపించే మరమనిషి
సూర్య చంద్రునిలా చూపుడుముండ్లు తిరుగుతుంటవి
ఏ క్షణానైనా మనుష్యులతో సమానమంటవి
పరిశ్రమలను తెరిపిస్తవి మూయిస్తవి
జగతికి ప్రగతిని చూపెడతివి

కొందరికి శరీరంలో సగభాగం
ఎందరికో ముంజేతి కంకణం
ప్రపంచానికి పార్థసారథి
పగిలి పోతే పనికిరాని ఒట్టి బుడ్డి

భవిష్య చిత్రం

గతంలో ఐక్యతా సమైక్యత సమస్యలు లేవు
మనిషిలో ఆ భావం నిండుగా ఉన్నందున అది సమస్యకాలేదు
వర్తమానంలో ఇసుక దిబ్బలాంటి ఐక్యతను కట్టుతున్నారు
మనిషి మనిషిలో అనైక్యతా బీజాలు నాటుతున్నారు

మనిషిలోని ఐక్యతకు విభేదాలు పెంచుతున్నాయి
విభేదాలు పెరిగి క్యాన్సర్ వ్యాధిలా అంటుకున్నాయి
కండ బలం ఉన్నవాడు అంగ బలాన్ని పెంచుకొంటున్నాడు
గొర్రెల బలం చూసుకొని పిచ్చి కుక్కలా మొరుగుతున్నాడు

అడ్డమైనదారుల్లో అసంఖ్యాక విభేదాల్ని పెంచుతున్నారు
విధేయులను ఉత్తర దక్షిణాల బిస్కట్లతో పోషిస్తున్నారు
అవకాశ వాద నపుంసకుల పునాదులు వేస్తున్నారు
పనికిరాని భావాలతో మార్పును అడ్డగిస్తున్నారు

గుడిసెలకు బోర్డులు పెట్టి మురిసిపోయే నాయకులున్నారు
రంగు రంగుల జెండాల్లో రక్తాన్ని తాగుతున్నారు
మాస్ మీడియా కూడా అందుకు తోడున్నారు
అన్ని వర్గాలందున మేడలు కట్టిన జనం ఉన్నారు

గుడిసెలు లేవకుండ భవనాలు లేపుతున్నారు
మూలకొక్క దేవున్ని పెట్టి మూఢత్వాన్ని పెంచుతున్నారు
వైరుధ్యాలతో మనిషిని సతమతం చేస్తున్నారు
అణచబడ్డ శక్తులన్ని ఆయుధాల్లా లేస్తున్నవి
విభేదాలు సమసిపోయే మార్గాన్ని వెదుకుతున్నవి
సమతామమతలు ఒకటై మానవతను తెస్తారు
కులమతాలు దుమ్ముదులిపి ఐక్యత సాధిస్తారు
వ్యక్తులే శక్తులుగా "భారతం" లో వెలుగుతారు
మనిషిని మనిషి గౌరవించే మహాయుగం తెస్తారు

సర్వశ్రేయస్సు

సర్వసమ్మతమైన దుఃఖ విముక్తి
విశ్వంలో అష్టాంగ మార్గం
వారసత్వం చూపిన మానవునికి
దుఃఖ నిరోధక సూత్రం

వారసత్వమెప్పుడు సార్వజనీనం కాదు
కలియుగమందున బతుకులేదు
కాన మనుషులు మనసుతో ఉండిన
సర్వశ్రేయస్సు కనబడును

కోర్టులో న్యాయం

కుందేలును పట్టడానికి
పొదను కొట్టినట్లు
సత్యాన్ని పట్టడానికి
కోర్టు చట్టాల పుస్తకాలని దులుపుతారు

పుస్తకాలను త్రిప్పి అలజడి సృష్టించి
అడ్డదారినపోయి వడ్డీతో వసూలు చేస్తారు
నడ్డివిరిగిన ముద్దాయిలు కోర్టు చుట్టూతిరగలేక
ఇక్కడ న్యాయం అమ్మబడుతుందని గగ్గోలు పెడతారు

భూగోళం

బొంగరంలా
భువిపై మనిషి
ఊసరవెల్లిలా బతుకుతు
బరువైన సమాజాన్ని చూపెడుతున్నాడు
చూపుడువేలు సమాజాన్ని చూపితే
బొటన వేలు తననే చూపెడుతుంది
సమాజం నీవంటుంది
సారథ్యానికి బాధ్యుడవంటుంది

కపటం

పుట్టుకతో కపటం చుట్టమై నిలుచుతుంది
పువ్వులాంటి రెక్కలపై పచ్చ బొట్టు పెట్టింది
మోసాల్ని ద్వేషాల్ని మురిపంగా నేర్పింది
సహజత్వం విడిచి సమాజంలా పెరగమంది

కన్నీళ్ళకు కపటపు ఆనకట్ట గట్టింది
కుటిలత్వపు బుద్ధులతో కడుపు నింపుకోమంది
పేగులను లెక్కించే కపటనవ్వుల్ని నేర్పింది
హృదయాన్ని సైతం కలుషితం చేసింది

సమాజమనే పదాన్ని చాకిరేవు చేసింది
కాగితపు పడవలాగా బతుకు నడపమంటుంది
చాతుర్వర్ణాలతో మతం మడిచి మట్టుబెట్టింది
కక్షలకు కపటాలకు బతుకు అడవి చేసింది

కులమత అహంకారం కలిసి కుట్ర చేసింది
బతుకు దారిలో ముల్లు నాటి బజారు పాలు చేసింది
విభేదాల ముసుగులో సజావుగా బతకమంది
బాల్యంలోనే ముసలి బాటలో నడిపింది

అబద్ధాలు ఆడడం అతి సహజం చేసింది
మెలుకువపై దుమ్ము పోసి మద్దెలలాగా బ్రతకమంది
మద్దెలలాగా బతుక లేక మనసు చచ్చి పోతుంది
మనసు మమత ఏకమై మానవతను అడుగుతుంది

అమ్మ

మా అమ్మ
కష్టాలకు కన్న తల్లి
మా తండ్రికి
తల్లిని మరిపించే తల్లి

ఉగ్గు పాలను కలిపినట్లుగా
పెరుగన్నం కలిపి తినిపిస్తుంది
మనం పడిన బాధలు భావితరాల గాధలైతాయని
బుజ్జగించి నిద్రింప జేస్తుంది

బతుకు పోరుతో
మరణ శయ్యమై మారాము చేస్తుంటే
మానాన్నే
మనం ఎప్పటికి ఉండడానికి రాలేదని ప్రభోధిస్తుంది

కొడుకులు కోడళ్ళు
కొయ్య బొమ్మల్లా చూస్తూ పోతూ ఉంటే
మల మూత్రములు కడిగి మంచి చేస్తుంది
నీకు తోడుగా నేనున్నానని నచ్చ జెప్పుతుంది

భార్య తల్లిలా
సకల పరిచర్యలు చేస్తుంది
ఆఖరి దినాలలో ఆలుమగలు
అనురాగ బంధాలలో తల్లి కొడుకులు

విశిష్ట

మృత్యు ముఖమున అమ్మ

మా అమ్మ
మూడు వారాలుగా
మృత్యు ముఖమున కూర్చుంది
ముదిరిన గాయాలతో మృత్యువును ఆహ్వానిస్తుంది

వంద వసంతాలను చూసింది
బ్రతుకంతా శ్రమ సంస్కృతి బాటలో నడిచింది
మూడు తరాలకు శక్తినంత ధారపోసింది
ఎండిన ఆకులా పడుంది

కన్నవాళ్ళు ఆస్తికే ప్రాధాన్యత ఇస్తున్నారు
అమ్మను మరచి అన్ని మూలలు వెతుకుతున్నారు
వారి ముఖాలు చూడలేక చీకటిలో మూలుగుతుంది
చివరి చిరునామాకై వెతుకుతుంది

ఈగలే స్నేహితుల్లా తిరుగుతున్నవి
చీకటి భవిష్యత్తులో వణుకుతుంది
కన్న వారికి ఆమె పిలుపు వినిపించడం లేదు
మృత్యువు రాలేదు అమ్మ నిదురపోలేదు

పండిన ఆకులా శరీరం
విశ్వంతరాలను వెతుకుతున్న జాగృతి
ఆఖరి క్షణాలలో ఆత్మ జ్ఞానం
మృత్యువు అమృతంలా ఆహ్వానం

సంక్రాంతి

సంక్రాంతి
సంవత్సరానికోసారి వస్తుంది
అలాగే మళ్ళీ వచ్చింది
ఈ దినమంతా గతంలో తీసుకెళ్ళింది

మారుతున్న సమాజంలో
మారని వ్యక్తులతో మమేకం అవుతుంది
ముగ్గుల ముసుగులతో కప్పుతుంది
మనుషుల్ని గంగిరెద్దులా ఆడిస్తుంది

ఫెర్టిలైజర్‌తో పంటలు పండించినా
పెండ గొబ్బిల్లనే పెట్టమంటోంది
స్త్రీలను వంటింటి కుందేళ్ళుగా మార్చి
పురుషాధిక్యతకు కుర్చీ వేస్తుంది

గాలిపటాల్లా ఎగిరే యువకుల్ని
కపట వేషధారి గాథల్ని చెబుతుంది
టీవి కంప్యూటర్‌లు చెత్త డబ్బాలను
గొబ్బెమ్మ పాటలు పాడమంటుంది

ఎగిరే రైతన్నలను ఎద్దులకు ముడివేసి
పెట్టుబడి వ్యవస్థ బానిసల్ని చేసింది
మారిన సంఘంతో మారని వారని
సంస్కృతి దీపాలతో ఎలుగెత్తి చెబుతుంది

ఇల్లు కట్టించిన శ్రామికుల శ్రమను మరచి
నిమ్మకాయ రక్షణను కోరే ఈ మనుష్యులు
కొత్త వాహనాలకు నిమ్మకాయలు కట్టి జరుపుకుంటుంది
వర్తమానంలో ఇలా సంక్రాంతి వైభవం

ప్రకృతికి వందనాలు సమర్పించే ఈ పండుగ
వర్తమానంలో వాస్తవాల్ని చూడగలిగితే
విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా వెలుగుతుంది
ఉన్నతికి ప్రకృతికి పర్వదినం అవుతుంది

ప్రకృతికి వందనం సమర్పించడం
ప్రకృతి సహజంగా బ్రతకడం
ఉన్నతికి వినయంగా సంక్రాంతి వైభవం
ఆనందించడం మరియు ఆనందించడమే

చీకటివెలుగుల తికమక

రాత్రంతా మేఘాల్లా వచ్చి పోతున్న ఆలోచన్లు
మెరుపుల అరుపులలో కలువరింతల గుసగుసలు
అవిశ్రాంత ముఖంపై సామాజిక మరకలు
నిద్దురలో చేదు అనుభవాల తికమకలు

మరకలతో ఉదయం బ్రతుకు ప్రయాణం
రాత్రి నిద్రకు దూరం దినమంతా బ్రతుకు భారం
గతం స్మృతులలో ప్రస్తుతం వ్యర్థం చింతనం
జీవితం ముందుకు అడుగువేస్తే చైతన్యం

తెరచాప లేని నావ బ్రతుకు జీవనం
సుడిగాలిలో మెడలు వచ్చి బ్రతకడమే దుర్గుణం
అర క్షణం అయినా దైర్యంతో బ్రతుకు జీవనం సుఖమయం
క్షణ క్షణానికి క్రొత్త జీవనమే పరమార్థం

లేబర్ రూమ్

శరీరం శ్రమించి
సర్వ అవయవాలు కదిలి
రోమ రోమం నిక్కబొడిచి
సృజనకు శ్రీకారం లేబర్‌రూం
చెమటలు కారి
శరీరాన్ని స్నానమాడించి
చక్కని శిశువుకు జన్మనిచ్చును
అది మట్టిలో మాణిక్యమై వెలుగును

పికాసో చిత్రమైనా
రవీంద్రుడి కావ్యమైనా
కదిలేది శ్రమ తోటి
కదిలించేది వేల హృదయాలను

చెమట దుర్వాసనని వెదజల్లిన
అసహ్యించుకొనేంత వాసన్లు ఉన్నా
అదే అందరి జన్మ చిరునామా
సృజనాత్మకతకు బ్రహ్మనామా

మనసు మైలపడితే

మనసు మైలపడితే

హృదయంతో ఆలోచించాలి

మదిలోని చీకటిని పారద్రోలడానికి

మనస్విత ద్వీపాన్ని వెలిగించాలి

మనసును మమతతో తుడవాలి

కాలు జారకుండా కాసేపు చూడాలి

రెండు కాళ్ళు ఒకేసారి నడవవు

మొదలైనది ముగింపు చూస్తుంది

అప్పుడే మనసుపై మైల రాలిపోతుంది

ధరించిన బట్టలతో నాటకాలు వేయలేవు

జేబు రుమాల్తో ఉరి కుదరదు

బ్రతుకు ప్రయాణాల్లో

అలజడి లేని ఆత్మానందాన్ని పొందాలి

మార్గాలు

జీవించడానికి ఎన్నో మార్గాలు
విశాల మార్గాలు వాహనాల్లో బ్రతికే వారికి
ఇరుకు సందులు పందుల్లా బతికే వారికి
అగ్నిలా బ్రతికేది అష్టాంగ మార్గం

కొందరు అరచేతి గీతలపై నడుస్తారు
మరికొందరు దొడ్డి దారిన బ్రతుకుతారు
బల్ల క్రింద చేతులు పెట్టి ఏమేమో వెతుకుతారు
మనుషుల దారుల్లో భ్రష్టత్వాన్ని పరుస్తారు

మట్టి ఇటుకలతో గోడల్ని లేపుతుంది
రాళ్ళలో గోపురాలను నిలబెట్టింది
రాళ్ళు సిమెంట్ రాజ్యాలను నిర్మించింది
ఆ రాజ్యాలు ఇప్పుడు రాళ్ళపాలైనవి

మట్టి గృహాలు గబ్బిలాల నిలయాలైనవి
నిలయాల ధృక్పథాలు నిరుపయోగమైనవి
అంతర్ నినాదమే అసలు మార్గం
మనిషిలోని మార్గమే మహాబోధి

జాగృతిలోని మార్గం అష్టాంగ మార్గం
రాజ్యాన్ని వదిలి రాగి చెట్టు నీడలో
బుద్ధుడు జ్ఞానియై విశ్వనిలయమాయెను
విశ్వంలో వెలుగులా వికసించెను

నేను లేనిది

నా కాళ్ళను ముల్లు మోసుకపోతవి

చెత్త చెదారం సోపానంలా మెత్తనౌతుంది

నేను నూతన మార్గాలు సృష్టిస్తాను

నేను ఏ ఆంక్షల అడకత్తెరలో చిక్కని స్వేచ్ఛను

అజ్ఞానం ఇదని చెప్పటం కాదు

అనుభవాల కెరటాలలో అన్వేషించాలి

జ్ఞానానికి దారులుండవు ఎక్కడైనా ఉంటుంది

వెతికే దీక్షలో ధ్యానంలా జ్ఞానముంటుంది

తామరాకుపై నీటి బొట్టులో సూర్యునిలా ఉంటుంది

వికసించిన పువ్వుల్లో పరిమళంలా ఉంటుంది

ఏకాంతంలో లోకాల్ని చూస్తుంది

లోకంలో మమేకమై విశ్వాన్ని చూస్తుంది

విశ్వ విశ్వాసాల్లో నేను లేనిది నిలుస్తుంది

మెదడుకు ఉరేసుకున్న తనువు

తల లేదు మెండెమున్నది
తల మనస్సు తనువై ఉంది
తల ప్రపంచాన్ని నములుతుంది
మొండెము మౌనంగా అనుసరిస్తుంది

మెదడుకు మేతా తనువు నుండి పోతుంది
రక్తాన్ని తలత్రాగి యముడిలా ఉంది
రక్తాన్ని త్రాగుతూ తనువు తనను మరిచింది
మొండెముపై తల మోదుగు పువ్వులా ఉంది

మెడపై తల దిక్కుల్ని చూస్తుంది
మోసే వాడిని విడిచి ఆకాశమునకెగురుతుంది
తలకు మెండెము ఉరి వేసుకున్నట్లుగా ఉంది
తల తనువును ఆటబొమ్మలా ఆడిస్తూ ఉంటుంది

తర తరాల్నుండి తనువు సందిగ్ధములో ఉంది
సందిగ్ధములో మునిగి నరకాన్ని చూస్తుంది
వ్యధల్ని మండిస్తూ పొదల్లా కూరుకు పోయింది
తల మొండెము ఒక్కటైతే స్వర్గం ఇక్కడే ఉంది

తరాల నుంచి తనువు బానిసైపోయింది
తనువును మరచి అణువణువును మండిస్తుంది
తల తనువు ఒక్కటిగా కలిపి ఉంచితే
భూలోకమే స్వర్గమై విలసిల్లుతుంది

చిరునవ్వు

హృదయాన్ని కదిలించి
దేహాన్ని మరపించి
దేదీప్యమానంగా ముఖమున వెలుగుతుంది
ఎన్నో మొహాలను వెలిగిస్తుంది

నవ్వులకు పువ్వులాంటి కళ్ళుంటాయి
కళ్ళతో పరిమళించే హృదయాల్ని పులకిస్తాయి
పూచిన హృదయాల్తో
రేయింబవళ్ళు వెలుగును చిందిస్తాయి

ఈ వెన్నెల నవ్వులు ఎప్పటికీ ఉంటవి,
ఎరిగిన వారి పెదాలపై పూస్తుంటవి
మొరటు వ్యక్తిత్వాల వెనుక దాగుంటవి
మసి బూసి మారేడు కాయల పలికిస్తుంటవి

మనిషి నవ్వే జంతువని ధృవపరుస్తవి
జంతువుకు మనిషికి తేడా తెల్పుతుంటవి
మనిషిలా బ్రతకమని తెల్పుతవి
ఆనందమయ జీవితానికి హారతులైతవి

స్నేహం

స్నేహం
మానవతా హృదయాల వసంతం
మనుసుల మమతల ప్రేమానుబంధం
ఆంతరంగిక హస్తాల ఆశయం

ఇది ఒక మధుర బంధం
అందరిని అలరించే ఆనందం
ఎల్లలు లేని స్వేచ్ఛతో కూడిన అనుబంధం
అనుబంధాల మకరందాల సంబంధం

అభిమాన పొదరిల్ల సాక్షాత్కారం
రెండు శిఖరాల పునాదులు కలిసిన చోట
స్నేహం జనిస్తుంది, పువ్వు వికసిస్తుంది
గులాబీల్లా పరిమళాన్ని చిందిస్తుంది

మనసుల కలయికలోని ఆరాటం
మమతానుబంధాలలోని భావన
స్నేహం ఆంతరంగిక జీవుల అన్వేషణ
ప్రేమ పెంచుకోవాలనే హృదయారాటం

స్నేహకిరణాలు అద్భుతమైనవి
సూర్యునిలా మనుసుల లోతుల్లోకి పోతవి
గాలి నీరు లేని ప్రాంతాల్ని కదిలిస్తవి
గరళాన్నైనా సునాయాసంగా మింగేస్తవి

స్నేహం అనుబంధంతో రాగాలు తీస్తుంది
రాగాను రాగాలతో చైతన్యపరుస్తుంది
విశ్వంతో మమేకమవుతుంది
స్నేహం విశ్వంతో చేతులు చాచుతుంది

దివ్వెగా వెలిగేది స్నేహం
స్నేహానికి మారు పేరు దైవత్వం
ప్రేమకు రెండువైపుల వీటిప్రబోధం
ఇవే ప్రకృతికి పరమ సన్నిహితం

మనసు

మనిషి మనసు వెన్న
మనసు మనిషికి సారథి
మనిషి ప్రతిక్షణం మారుతుంటాడు
మనసు మనిషిలో పెరుగుతుంది

మనిషి మనస్సు
మంచి సరస్సులాంటిది
తీపి చేదు లాంటిది
ఇవి నాణానికి రెండు వైపుల వలె
మనసుల చేతుల్ని ఆలోచనల్ని చుట్టుకొంటవి
గుప్పు గుప్పు పొగతో కళ్ళు మండుతుంటవి
మంచులాగ కరిగి ఉదయాన్నే వెళ్ళిపోతవి

చీకటి తెర నుండి సూర్యుడుదయిస్తాడు
మంటల్లోనే కణం లాగ పైకి ఎగురుతాడు
ప్రపంచం కన్నుల్లో వెలుగు నింపుతాడు
విశ్వమంత పెరుగుమని విశ్వాన్ని వెలిగిస్తాడు

మతోన్మాదం

దేవుడనే పదానికి
దేవుల్లను బొమ్మలు చేసి
దేవాలయాల్లో ప్రతిష్టించారు
గుడి చుట్టు ప్రదక్షిణలు చేసి గుడ్డి నమ్మకాలను సృష్టించారు

నమ్మకాలను పరిశుద్ధ గ్రంథాలుగా
భక్తుల పై మోయలేని భారాన్ని మోపారు
భారమే భద్రతగా మత మౌఢత్వాన్ని పెంచుతున్నారు
మత వాక్యాలు మానవత్వానికి దూరమై మతోన్మాదాన్ని పెంచుతుంది

దివ్యశక్తి

కనుల కలయికతో
హృదయ తంత్రులను కలిపి
మదిన ముద్రలు వేసి మనసునిలిపి
తనువునందు తనను తాను ఎరిగిన శక్తి

దేహమందు వెలుగు దివ్యశక్తి
శక్తి సర్వసృష్టికి ఆధారం
పంచభూతాలకు ప్రాణం
ప్రపంచంలో నుండే ప్రేమ రూపం

దీపావళి

టపాటపా పటాకలు
ఆకాశంలో మెరుపుదాడులు
ఇంటి ముంగిట దీపాల వెలుగులు
ఈ దేశంలో ఎన్నడు లేని అరుపులు

టపాటపా శబ్దాలు తుపాకులు చేస్తున్నవి
తుపాకులే రాజ్యమై టెర్రరిజం తెచ్చింది
టెర్రరిజం ముసుగులోన క్రూరత్వం పెరిగింది
ఉన్నవాడి ఇంటి ముందు శబ్దాలు వస్తున్నవి

డబ్బున్నవాడు దర్జాగా చేస్తున్న ఖర్చులు
లేనివాడు ఏడ్వలేక చేస్తున్న అరుపులు
ఉన్న లేని తేడాలు ఇప్పుడైనా చూడవచ్చు
కళ్ళుంటే మానవతకు మారు పేరు పెట్టవచ్చు

మూర్ఖుడు చస్తే దీపాల దీపావళి
మూర్ఖత్వం పెరిగితే అదో ఉత్సవ సమితి
ఏదో ఒక రూపంలో ఉన్నవాడికే లాభం
లేని వాడికి ప్రతి దినం శివరాత్రితో సమానం

ధ్యాన రూపం

అందమే ఆనందం
ఆనందమే ఆధ్యాత్మికానందం
దాని చిహ్నమే ఆరోగ్యం
శ్వాసపై ధ్యాసయే ధ్యానం

సుఖమైన నిద్రలో వికసించును
దినమంతా మమతతో పరిమళించును
లోకమే ఇహలోక ఉద్యానమౌను
పరలోకము భూమిపై విలసిల్లును

విశ్వ సవ్వడిలో జాగృతి
ధ్యాని పరిమళంలో జగమెరుగును
మనిషి సృజనాత్మకంగా వెలుగొందును
మనసంతా పరమాత్మలో ఉండును

పరం వరంలా తపస్సునందును
మనసు మేఘాల్లా ఆకాశ అద్దంలో
గగనం పువ్వుల్లా ప్రేమల్ని కురిపించును
ప్రతి క్షణం పండుగలా గడుచును

గతకాలం నుండి వర్తమానం వరకు
క్షణం క్షణం అనుక్షణం అన్ని వేళలయందు
వెలుగులా విశ్వమంతా విస్తరించి
సర్వంలో తదేకంగా నిలుచును

భౌతిక సాంకేతిక శాస్త్రాలయందు
సామాజికస్థితి గతులను చలింపజేస్తుంది
సామాన్యుని నుండి సామ్రాట్టు వరకు
చలనమే దైవ గుణమని నిరూపిస్తుంది

ఎన్నెన్నో రూపాలలో అన్నింట్లో తనై
పంచభూతాల్లా పరిశ్రమిస్తూ
అగ్నిలా ఆకాశానికి ఎగబ్రాకుతూ
వర్షంలా భూమంతా ప్రవర్తిస్తుంది

వసుధైక సౌజన్య చక్రంలా
సృజనలో సమ్మోహిత దీపంలా
పరిణామ ప్రగతులలో పావురంలా
ప్రకృతిలో ప్రతిక్షణం పరివర్తనంతో మమేకమైంది

మానవత

మానవత ఊత పదమైంది
మనిషిలో మరుగున పడిపోతుంది
మనిషికి మనిషి శత్రువైతుంటే
మానవత నడుగు దినాలు వచ్చినవి

భూమి మీద కోట్ల కొలది మానవులు
అందులో ఎందరో శారీరక మానవులు
మరి కొందరు మానసిక మానవులు
మనిషిని మనిషిగా గౌరవించేవాడు నిజమైన మానవుడు

మానవత కలిగిన మానవుడు
మానవతని ఊతపదంగా చూడడు
పదాల గారడిలో పడిపోడు
ఏ పరిస్థితులలోనైనా ప్రభాతంలా ఉంటాడు

కోకొల్లలుగా ఉన్న సమస్యలలో
కొలమానమైన జ్ఞాన వెలుగులా ఉంటాడు
తనలోని వెలుగుతో చీకటిని వెళ్ళగొడుతాడు
వసుధైక కుటుంబం అని పలుకుతాడు

మతాల్లోని మానవతని చూస్తాడు
దైవంలోని దివ్వెలా వెలుగుతాడు
దివ్వెతో తన చుట్టూ దీపాల్ని వెలిగిస్తాడు
దీపాల వెలుగులో దివ్వె అవుతాడు

కులమతాలు అతన్ని అంటుకోలేవు
కుచ్చితమైన బుద్ధులకు దూరమంటాడు
కపటపు బతుకుల పసిగడ్తాడు
మానవత తన మతంగా బ్రతుకుతాడు

పున్నమి

ఈదినం కొత్తగా ఉన్నది
చీకట్లు పారిపోతున్నవి
వెలుగే విశ్వమై నిండుకున్నది
పున్నమిలో ప్రకృతి విశిష్టంగా యున్నది

దినమంతా వేడిగా వెలిగిన సూర్యుడు
సాయంత్రం చల్లగా మారాడు
సూర్యుడు చంద్రుడిలా మరోజన్మనెత్తాడు
ఈ జన్మతో భూమి చల్లగా ఆనందిస్తుంది

వెలుగులో వచ్చిన మార్పుతో వింత అనుభవాలు
సముద్రాలు హోరున అరుస్తున్నాయి
కలలు సృజనాత్మకతన పొర్లుతున్నవి
ప్రకృతి క్రొత్త అందాల్లో సుందరంగానున్నది

చంద్రుడు సూర్యకాంతిలో మొలిచాడు
సిద్ధార్థుడు జ్ఞానోదయం పొందాడు

చల్లని వెలుగై విశ్వంలో శాంతిని నింపుతున్నాడు
ధ్యానం జ్ఞానం ఒకటని చాటి తెలుపుతున్నారు

పక్షులు ఒంటరిగా ఉండటాన్కి తిరస్కరిస్తున్నాయి
పుట్టల్లోని పాములు జంటలుగా తిరుగుతున్నాయి
వన్యప్రాణులన్ని వైభవంగా బ్రతుకుతున్నాయి
ప్రకృతి పరవశంతో నిండుకొన్నది

ఇది యుగాల్నుండి తరుగని అనుభవం
నెలకొక్కసారి ప్రకృతి పరవశించే దినం
ప్రకృతిలో ప్రతి వ్యక్తి ఆనందించే సుదినం
జ్ఞానోదయాలు కలిగించు పర్వదినం

చైతన్యంలో సర్వమైన వ్యక్తి
సమయస్ఫూర్తితో ఛలోక్తిగా బ్రతుకు శక్తి
యువతలో జాగృతి వెలుగువ్యక్తి
సర్వకాలాలలో శాంతియే వెలుగు శక్తి

ప్రేమికుల మోములో మెరుపు
హృదయాలను కలిపే దివ్యానుభూతి
ఆనందాల్ని పంచే జ్ఞానయోగం
ఆకాశం నిండ నిలువెత్తు స్వరూపం

ఆది అంతములను దాటిన మహాశక్తి
వర్తమానంలో వెలుగు దివ్యశక్తి
సంగీత సారస్వతాలకు అందించే ఘనకీర్తి
కళలన్నింటికి కళాత్మకుడైన మహాభోది

(ఆ)ధునిక కవి

గతాన్ని మాటల్నీ తలలో పులుముకొన్నవారు
భాషామంత్ర ప్రయోగంతో మనుష్యుల్ని మెస్మరైజ్ చేయువారు
మెస్మరిజం చేసి మెరుపుల పొగడ్తలలో సకిలించువారు
పొదచుట్టూ కొట్టి వస్తువును పోస్టుమార్టం చేయువారు

స్నేహ బంధుత్వాలతో పత్రికలలోకెక్కువారు
అధికార రాజకీయ సాహిత్యాన్ని పోషించువారు
కులమతాల్ని అవసరమైనంత జోడించువారు
కాకిలా సభల్లో అరుస్తూ చెణుకులు విసురువారు

ఆంగ్ల సాహిత్యాన్ని తెలుగీకరించువారు
అటుఇటు సదిరి పెంట కుప్పల్లా కవిత్వాన్ని పండించువారు
తాతముత్తాతల తలంపులను కొత్తగా పెట్టువారు
పాత 'సారా'న్ని కొత్త సంచిలో నింపెడివారు

ప్రజాకవులమని మానవతను పాటించనివారు
విప్లవ యుగమని నేరాల్ని పోషించువారు
అభ్యుదయులమని మార్పుకు ఆమడదూరముండువారు
ఊసరవెల్లులా ఉంపుడుగత్తెల్లా బ్రతుకువారు

నిజానికి అబద్ధానికి మధ్యఎత్తైన గోడకట్టి
వసంతాల్ని శిశిరంగా మార్చి వేయువారు
సాహితీ చౌరస్తాలో హోంగార్డులు
చతికిలపడి కోమాలో బ్రతుకు జీవులు

గతకాలపు కీర్తి శిఖరాల శిథిలాలు
21వ శతాబ్దపు గడపలో నిలిచి 17వ శతాబ్దపు విత్తనాలు చల్లువారు
మనుధర్మశాస్త్ర మస్తిష్కంలోంచి మాదరన్‌గానుండువారు
మహిలో మనిషి మహాత్ముడగుదారులు తెలువని వారు

విశిష్ట

మాస్టర్‌కీ

మాటి మాటికి
మదిలో మెదలేది
మెలికలు తిరిగే సమస్యలలో
మెదలక స్థిరముగా ఉండేది
మనసు తనువూ అర్ధించి
తపస్సులాగ బ్రతికించేది
అన్నింటిలో తలమానికమై
అగ్రభాగమున ఉండేది
సమస్యల తాళాలు తీసి
అమూల్యమైన ఆలోచనలను
ఆవిర్భవం చేసేది అవనిలో నిలిచేది
మాస్టర్‌కీ మనిషిలోని జాగృతి
జాగృతి కలిగిన మనిషి
ఎరుగును తను ఎవరో
తెలుసుకొనును తనలోని వెలుగును
తనలోని వెలుగుతో విశ్వము వెలుగును

మార్పుకోసం సంఘర్షణ

విశ్వమొక విచిత్ర విశిష్టం
పరివర్తన విశిష్ట ఆధారం
మార్పు ఇరుసుగా ప్రపంచ గమనం
విశ్వపచ్చదనానికే ఇదే కారణం
విశ్వంలో ఎన్నో కారకాలు
కారకాలలో కోట్లాది అణువులు
అణువణువున ప్రత్యక్షమవుతుంది మార్పు
పరం నుండి ప్రపంచం పరివర్తనమయింది

సమైక్యత - 1

గతంలో మనిషి ఐక్యంగా ఉన్నాడు
క్రమంగా తన త్రోవ తప్పాడు
ప్రస్తుతం తడబడుతూ బ్రతుకుతున్నాడు
ముందు వచ్చే మార్పుకు వేచియున్నాడు

ఐక్యంగా ఉంటే అణచివేశారు అప్పుడు
సమైక్యత అంటూ మొత్తుకొంటున్నాడు ఇప్పుడు
అప్పుడు ఇప్పుడు ఒక్కటే కులమతాలదారి
అది పోయిననాడు ఐక్యత సమైక్యత

ఐక్యత కావాలని అందరి మనస్సులో
సమైక్యత గూర్చి మాట్లాడుతారు పది మందిలో
వేర్వేరు దారుల్లో స్వార్థాలతో నడుస్తున్నారు
సాయంకాలానికి చతికిల పడిపోతారు

ప్రతి ఉదయానికి కొన్ని గొంతుల్ని నులిమివేస్తున్నారు
రక్తాన్ని దిద్దుకొని పేపర్లు కనులముందుంటున్నాయి
విపత్కాల పరిస్థితులను తెలుపుతున్నాయి
ప్రతి వ్యక్తికి తన కర్తవ్యాన్ని బోధిస్తున్నాయి

గుడిలో పూజచేసేవాడు దేవుడికి నిప్పంటిస్తున్నాడు
కులాల్ని నమ్మేవాడు శవాల్ని కోసి పాతిపెడ్తున్నాడు
భాషా ప్రాంతం మీదుగా లంకేసుక తిరుగుతున్నారు
శవాల్ని చంపి ఏదో ఒక పేరు పెడ్తున్నారు

మనసులోని కసితో మనషుల్ని చంపుతున్నారు
విభేదాల ముసుగులో ప్రజలు బ్రతుకుతున్నారు
విభేదాలే శత్రువుపై విజయం ప్రకటిస్తున్నారు
గతంతో నిండిన కసితో నేరాల్ని చేస్తున్నారు

నేరాల్ని మోసేవారు ఐక్యత అంటున్నారు
రాజకీయాలు చేసేవారు సమైక్యత అంటున్నారు
వీరందరు ఒక్కటై మేధావుల్తో ఆడుకొంటున్నారు
మేధావులు చాపకింద నీరులా జారిపోతున్నారు

దేశంలో విచకిచ పరిస్థితి
ఏమిచేయాలో తెలువని పరిస్థితి
ఎందరెందరో నేరాలకి ఆహుతైనదుస్థితి
ప్రతివారు మార్పును కోరుకునే పరిస్థితి

మతం మనిషిని తుపాకితో నడిపిస్తుంది
తుపాకి నిశ్శబ్దంగానే వారిని అనుసరిస్తుంది
మతం తుపాకి గతానికి నడిపిస్తుంది
అడ్డమొస్తున్న ఆధునికతను అణచివేసి ముందుకెళ్తుంది

అస్సామీలు తూర్పున అడవి బిడ్డలంటున్నారు
ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు లేపుతున్నారు
ప్రభుత్వం పడిపోయిన పడగదించక బ్రతుకుతున్నారు
ఉషగొట్టి బుసగొట్టె టెర్రరిజాన్ని నేర్చినారు

దేశం అయోధ్యనుండి అరుస్తుంది
ఎవరు ఎక్కడ నిశ్శబ్దంగా ఉన్నా నేనూరుకోనంటుంది
ఐక్యత ఇటుకలతో సమైక్యతను సమాధిచేస్తుంది
దిన దినానికి మార్పే ముందుకెళ్తుంది.

సమైక్యత - 2

స్వాతంత్రం వచ్చింది ఆనాడు
జెండాపై కపిరాజులా ఉంటుంది ఈనాడు
ప్రజలకు దీపంలా కనిపిస్తుంది
దారిద్రానికి ఉరివేసుక బ్రతుకుతుంది

కుల మతాల మేడలో అగ్గి రాసుకొంటుంది
టెర్రరిజం చేతులకే స్వాతంత్రం వచ్చింది
అలజడే ఊపిరిగా ఆయుధాలు లేస్తున్నవి
ఆందోళనలో దేశం అడుగు ముందేస్తుంది

దేశమంత విచకిచ పరిస్థితి
ప్రజలేమి చేయాలో తెలువని దుస్థితి
రాజకీయాల్ని నిరాశ ఓట్లతో ముంచేసి
పరివర్తన జరుగాలని ప్రపంచం వైపు చూస్తుంది.

తూర్పున బోడో ఉద్యమాలు
పడమరప బాంబ్ బ్లాస్టులు
మధ్య భారతంలో తందూరి మరణాలు
దేశమంతా సమైక్యతా ఉద్యమాలు

క్రూరుల సుఖం

విజయుడై వీరుడు
విజయ పతాకముల కెగిరెను
క్రూరుడు వీరత్వం చూపి
మత్తులో గమ్మత్తులు చూపి
ప్రజలనెత్తురు తాగెను
చెత్తబుట్టల్లా చెరువు నీరుతాగి
ఉత్తి తిత్తులొదిలి వొరిగిపోయిరి
పొలిటేషన్ మరణిస్తే పేపర్ల సానుభూతి
సోషల్ వర్కర్ మరణిస్తే ప్రజల సానుభూతి
ఇద్దరు మరణిస్తే వ్యక్తులకు స్వేచ్ఛ
స్వేచ్ఛలో వ్యక్తులు అనంత శక్తిమంతులు

నిలువెత్తు తత్త్వం

పువ్వుల్లా పూబోణులు రోడ్డు సమాజంపై వెళ్తున్నారు
వేల అందాల్ని ప్రకృతి కందిస్తున్నారు
తుమ్మెదలు అస్పష్ట సెక్స్ ముసుగుల్లో ఎగురుతున్నవి
రోడ్డు సమాజం వారితో రోలర్‌లా కదులుతున్నవి

ప్రేమ పుష్పం లాంటిది
స్వేచ్ఛా విహంగాలపై ఎగురుతుంది
అణచి వేస్తే రెట్టింపుగా ఎదుగుతుంది
పిచ్చి ముదిరితే దేశమంతై నిండుతుంది

ఊహల స్వప్నాల మేడలు నిజంకావు
మేడలో ఫర్నిచర్‌లా జీవితం కాదు
దేహాన్ని విడిచి పరిగెత్తే మనసు బ్రతుకుకాదు
మనసు నిలకడలో నిలువెత్తు మానవత్వముంది

నిన్ను నీవు తెలుసుకో

నేస్తమా !
ఈ దినము చాలా విలువైనది
రేపు ఈ దినం మీదనే ఆధారపడి ఉంది
ఈ దినాన్ని రేపటి కొరకు వృధా చేయకు
గులాబి పువ్వును చూడు
ఏ క్షణమైనా వృధా చేస్తుందా
ఎంత అందం ఎన్ని పరిమళాలు
ఒక్కదినంలో
ఎన్ని యుగాల జీవితముందో
పువ్వుతో ప్రేమలు పుష్పిస్తాయి
ఒంటరి వాళ్ళు జంటలైపోతారు
తుమ్మెదలు నృత్యం చేస్తాయ్
పువ్వు పుష్పించి నందుకే కదా !

సూర్యుణ్ణి చూడు
క్షణ క్షణానికి అభివృద్ధి చెందుతుంటాడు
ఎన్ని కిరణాలు ఎంత వెలుగు
ఒక్క దినంలో
ఎన్ని యుగాల జీవితాన్ని జీవిస్తాడు
ఉదయంతో
ప్రియురాలవుతుంది ప్రకృతి

పంచ భూతాలు ప్రసన్నమౌతాయి
మానవ జంతు జాలాలు మేల్కొంటాయి
విశ్వం పరిపూర్ణత పొదుతుంది
క్షణ భంగురం బ్రతుకు
పువ్వులా పుష్పించడం నేర్చుకో
సూర్యునిలా ఉదయించడం నేర్చుకో
నిన్ను నీవు తెలుసుకో

పాత - కొత్త

పాత ప్రపంచమంత పెద్దది
రోత ఎక్కడ చూసినా ఉంది
పాత రోతల్ని కలిపితే
పరమ మూర్ఖత్వం అవుతుంది

కొత్త క్రొవ్వొత్తిలా వెలుగుతుంది
అందుకుంటే అందల మెక్కిస్తుంది
ముందు వెనకల చూస్తూ కూర్చుంటే
మునపటి మనిషిలా బ్రతకమంటుంది

పాతను చూడమంటుంది
కొత్తగా బ్రతక మంటుంది
ప్రమిదలా వెలగ మంటుంది
వెలుగువై జీవించ మంటుంది

ఆలోచనలు

రాత్రనకా
పగలనకా
ఎడ తెరపి లేకుండా
ఆలోచనలే ఆలోచనలు

మంచివి చెడువి
జ్ఞాపకాలు స్మృతులు
కోరికలు ఆశయాలు
ఇంకా ఎన్నెన్నో

పొద్దస్తమానం
ఒకటే ఆరాటం
మెదడులో పోరాటం
తెగని తలంపులు తేలని సమస్యలు

నాన్న ఆదేశించినవి
అమ్మ బోధించినవి
బంధువుల బలవంతపు విలువలు
స్నేహితుల స్వేచ్ఛా విహంగాలు

ఇంకా ఎన్నెన్నో ఆలోచనలే ఆలోచనలు
మతాల ఫిరంగులు

సంస్కర్తల సందేశాలు
కులాల కుచ్చిత భావాలు

సోషలిస్టుల సందేశాలు
విప్లవకారుల నినాదాలు
తత్వాలు సిద్ధాంతాలు
భావాలు ఆలోచనలు ఇంకా ఎన్నెన్నో ....

ఆచారాలు వ్యవహారాలు
విలువలు ధర్మాలు
దేవుళ్ళు దయ్యాలు
భయాలు బెదిరింపులు ఇంకా ఎన్నో ఎన్నెన్నో ....

ధ్యానంలో గానంలో
నృత్యంలో మృత్యువులో
లాభంలో నష్టంలో
ఆశా నిరాశలలో ఆలోచనలే ఆలోచనలు

ఆలోచనలకు అంతం
ఆగ్యాచక్రంలో ఉంది
సమాధి దశలో
శాశ్వత ఆనందముంది

గ్రామాలు

ఎప్పుడు విశ్రమించని
ఎన్నినాళ్ళైనా సుఖమెరుగని
సర్వరోగాలను కప్పుకొని
దారిద్ర్యానికి సాక్షిగా నిలిచేవి

కుల వైషమ్యాల రోగాలతో
మందులు లేని ఆసుపత్రులు
పరివర్తనల కొరకు పరితపించే
గాంధీజ్ఞాన మందిరాలు

జ్ఞానోదయం కలగాలి
విజ్ఞానం వెయ్యి రేకులై వెలగాలి
మనిషి పుష్పంలా వికసించాలి
మానవత మన మతం కావాలి

సంస్కృతి

పూర్వం నుండి
ఖజురహో మార్కు సంస్కృతిని
ప్రైవేటురంగంలో ఉంచినా
పబ్లిగ్గా ఎదుగుతుంది
ఏ సంస్కృతిని
ఈ వ్యవస్థ అణగద్రొక్కాలనుకుందో
ఆ సంస్కృతే
ఈ వ్యవస్థను మార్చివేస్తుంది
పురుషాధిక్యత సాంప్రదాయాన్ని
సమర్థించిన ఈ వ్యవస్థ
ప్రస్తుతం మానభంగాలకు పరిణమించింది
స్త్రీ పురుషుల మధ్య మారణహోమాన్ని సాధిస్తుంది
ఆ సంస్కృతి
ఎన్ని హృదయాలను పులకించిందో
వేల సంవత్సరాలుగా
ఖజురహోలా బ్రతికే ఉంది
బ్రతుకు శివలింగమని పలుకుతుంది
ఏ సంస్కృతి
ఈ వ్యవస్థకు ప్రాణమైందో
ఆ వ్యవస్థే కాపాడుతుంది
ప్రతిక్షణం కొత్తమలుపులు తిరుగుతుంది
ఏ సంస్కృతీ శాశ్వతం కాదని చెపుతుంది
పరివర్తన శాశ్వతమని తెలుపుతుంది

వయోజన విద్యార్థులు

వయోజనులు యుక్త వయస్సులో ఛందస్సులు
ప్రపంచ బాహువుల్లోని శ్రామిక పుస్తకాలు
బ్రతుకు బాటలోని యాంత్రిక యాత్రికులు
గుమ్మం గుమ్మంలో గమ్యాల్ని వెతుకు బాటసారులు

అనుదినం శ్రమించు జీవిత చక్రాలు
చక్రీయ జీవితాల అష్టావక్ర జీవులు
అక్షర ప్రపంచానికి అన్నదాతలు
పనిలో గనిలో మణిలాంటి భరణులు

నిరక్షరాస్యత విజ్ఞాన పంటలు
విద్యయందు చింతలేని అనుభవాల గనులు
అక్షరాస్యత విద్యావంతుల కంటే ధనులు
అనుభవాల జ్ఞానంలో వెలుగు సృజనులు

విద్యా జ్ఞానోన్నతికి ఆలయాలు
జ్ఞానానికి అక్షరాస్యత తోడని నమ్మువారు
అక్షరాస్యత ఉద్యమంలో భాగస్వాములు
అక్షర, నిరక్షరాస్యుల ఐక్యతా శస్త్రాలు

వయోజన విద్య అక్షరాస్యతా ఉపాధ్యాయులు
నిరక్షరాస్యుల అనుభవాల జ్ఞానాన్ని పొందు విద్యార్థులు
క్రియా ప్రక్రియల సాక్షరతా సారాన్ని పెంపొందించువారు
వయోజన విద్యా జ్ఞానోపదేశకులు సమాజపరిచారకులు

విశిష్ట

ప్రేమ మనస్సు

ఇంటి ముంగిట ఇలవేల్పులా కూర్చుంది
ఒళ్ళంతా కళ్ళతో నిలువెల్ల చూస్తుంది
మౌనంగా మనసుతో మాట్లాడుకుంటుంది
మనసులో ప్రేమతో మురిసిపోతుంది

తలలో పూల తలంపుల దండను ధరించింది
పూల దండలో దారంగా నన్ను చూసుకొంటుంది
పువ్వుల్లా ప్రతిపూట బ్రతకాలని ఉంటుంది
పచ్చని తీగల పర్వంలో ఎదగాలనుకొంటుంది

కొమ్మచాటు నుండి కన్ను కొనల్తో చూస్తుంది
ఒల్లు విల్లులా వంచి బాణాల్ని వేస్తుంది
ప్రేమతో పిచ్చిగా మధన పడుతుంటుంది
హృదయాన్ని పిండేసి అర్పించుకొంటుంది

పదిమందిలో ఉండి ప్రతిక్షణం చూస్తుంది
ఒంటరిగా మమేకం కావడానికి తంటాలు పడుతుంది
ప్రియుడితో ప్రేమగా ఉండాలనుకొంటుంది
మనస్సుతో మాట మౌనంగా చెపుతుంది

అప్పుడప్పుడలగి అదృశ్యమౌతుంది
మనసుతో తను ఒకతే మాయమౌతుంది
ప్రేమ పక్షులై మబ్బుల్లో కెగరాలనుకొంటుంది
రాధామాధవుల్లాగా బ్రతకాలనుకొంటుంది

కవితా రేఖలు

కవితా కలం నుండి కదలడం లేదు
మెదడు ఆలోచన్లో చిక్కి మొదలు దొరకడం లేదు
ఎదరొదను వింటూ ఎగిరి ఎగిరి పడుతున్నది
మబ్బులాంటి ఆలోచన్లలో అప్పుడప్పుడు మెరుస్తున్నది

నడుస్తున్న త్రోవ మోడై చిగురించడం లేదు
మోడు దశాబ్దాలుగా పంచిన ముళ్ళు గుచ్చుకుంటున్నవి
రక్తాలు పారిన చోటే ముళ్ళజనారణ్యము పెరుగుతున్నది
అడుగడుగున ఆశల అంగట్లో ముండ్ల విత్తనాలే దొర్లుతున్నవి

నిరాశ చిరాయువై ఇంటిబాట వద్దంటుంది
ఇంట్లో ఈగల మోత ఎక్కువై నైరాశ్యం ఆక్రమిస్తుంది
దేశమంతా న్యూస్ పేపరై నేరాలతో బోర్‌కొట్టిస్తుంది
బోరుమని ఏడ్వలేక భారి ప్రణాళికల్ని మెదడు అల్లుతుంది

అల్లికలాంటి సమాజంలోంచి రాళ్ళే రాలుతున్నవి
ఉద్యమాలై రాళ్ళు మొలవాలని మెదడు కల కంటున్నది
రాళ్ళు మొలచిన విసిరిన, రాళ్ళే మిగులని మనసంటున్నది
రాళ్ళలో నుండి ముళ్ళ పొదలు మొలుస్తవంటున్నది

ముళ్ళు రాళ్ళ లాంటి వ్యధల్నించి వికసిస్తాయి పుష్పాలు
రాతి గుండెలనైనా మలుస్తాయి పరిమళాలు
ఎదను తాకిన పరిమళం చిగురించుచున్నది
మేఘాల్లాంటి ఆలోచన్ల నుంచి కవితా రేకుల్ని విసురుతుంది

ఉగాది

365 దినాలకో దినం
నూతన సంవత్సర మననం
గత రికార్డులను బ్రద్దలు కొట్టి
క్రొత్త రికార్డులను సృష్టించుకోవడం

ఈ సారి అలాంటి రోజు వస్తుంది
తెలుగు ఉగాదితో పిలువబడుతుంది
మార్పుతో తను కలిసి వస్తుంది
అభివృద్ధి ప్రగతులను ప్రపంచంలో సాధిస్తుంది

తూర్పు పడమరల ఉదయం ఒకటంటుంది
అన్ని దిక్కులకు కేంద్ర బిందువవుతుంది
విశ్వ మానవతకు దారి చూపుతుంది

నేరానికి క్రూరత్వానికి మానవత నేర్పుతుంది
మట్టిలోని మాణిక్యాలను విశ్వంలో వెలిగిస్తుంది
అసమానతలను ఆధునికతతో కడుగుతుంది
అవకాశాలను అందరికి సమానంగా అందిస్తుంది

హిపోక్రసీ పై ఇంటలిజెన్సీ యుద్ధం ప్రకటిస్తుంది
బోగస్ తలలు నరక బోధి జపం చేస్తుంది
వర్ణ వర్గ విభేదాలు తొలగిపోయే దినమస్తుంది
మనుషులంత గౌరవంగా బ్రతుకుదినం వస్తుంది

హౌజ్‌వైఫ్

మనస్సులో మాట పెకిలింది
హృదయం పెదవుల్ని కదిలించింది
మాట పెదవుల మధ్య పిరికిదయింది
మనసులో మహిళయి మరలిపోయింది

మగవారి ముందు స్త్రీ నిలువ లేకుంది
స్నేహ భావాల్ని చిన్నప్పుడు మరచిపోయింది
వయస్సుతో మనస్సు ఓణి కప్పుకొంది
సమాజం స్త్రీని అలా మభ్యపెట్టింది

భవిష్యత్తు భయమై నెత్తిన కూర్చుంది
స్వేచ్ఛకు అర్థాన్ని చెడుగా చూపింది
మనుష్యులతో కలిసి మనగా లేకుంది
మనిషై పనిముట్టులా బ్రతుకుతుంది

దినమంతా గానుగెద్దులా గడుపుతుంది
హౌజ్‌వైఫ్‌నీ అందంగా చెప్పుకొంటుంది
ఆశల ఎడారిలో నీరసం లా బ్రతుకుతుంది
బ్రతుకీడ్చుకుంటు భూమిపై ఈదుతుంది

తలవంచుక బ్రతుక మంది సమాజం
తల ఎత్తుక తిరుగుతుంది తన తత్వం
తనలోనే తనకు పెరుగుతుంది వైరుధ్యం
వైరుధ్యం కుంపటిలె బ్రతుకు కాలిపోతుంది

హిపోక్రసీ విత్తనం వటవృక్షంలా ఎదిగింది
నాలుక త్రిప్పి మాట్లాడ్డం అలవాటు అయింది
అనువుకాని దేదో చెప్పుకొను మొండి ధైర్య ముంది
అందుకే సత్యమైన మాట పెదవి దాటి రాకుంది

నిద్రరాకుంటే

రాత్రిలో చీకటి రాజ్యమేలుతూ,
దీపం వెలుగును ముట్టడించి
నిద్రతో చేతులు కలిపి వెలుగునార్పివేసింది
నాకు నేను కనబడకుండ చీకటి తనలో కలుపుకొన్నది

చీకటి మంచానికి కట్టివేసింది
సామాజిక చిక్కులతో స్నేహం చేసి బాధిస్తుంది
నిద్రలోకెల్తుంటే సమస్యలు పలవరిస్తున్నవి
మెదడును బంతిగా బజారులో ఆడుకొంటున్నవి

మనస్సు ఆకాశంలో ఆలోచన్లు తిరుగుతున్నవి
మేధస్సుపై చిక్కుల్ని అల్లుతున్నది
మనిషిని మానవతను మరిచిపోయింది
ఆలోచనలే ఆయుధాలై తలను యుద్ధభూమి చేసినవి

దేహం పక్షం నుండి ప్రతిపక్షమై చూశాను
ఆ చూపుతో నాలో ఆ ఆలోచనలు ఆవిరైనవి
సమస్యలు పువ్వుల కవచంగా మారినవి
రాత్రంతా మగత వెలుగులో మనోహరంగా సాగినది

ఎవరి దారులు వారివి

కవుల్ని చదివినప్పుడల్లా నేను వేరైతాను
ఆకర్షించిన ప్రతి శీర్షిక తిరిగిపోతుంటుంది
శిలా శాసనాల్లా ఎక్కడోమూల నాటబడుతవి
విశిష్టుల వేరైన దారిని మనస్సులో వెతుక్కుంటాను

వారిదారుల్లో వారు చక్రవర్తుల్లా కనిపిస్తారు
పేపరు భూమిపై ఎన్నోరాజ్యాలను సృష్టిస్తారు
ఒక్కొక్క హృదయం ఒక హస్తినాపురం
ఒక్కొక్క జీవితం ఒక కురుక్షేత్ర రంగం

జీవిత రణరంగంలో అందరూ యోధులే
మల్ల యుద్ధంలోనో, కత్తిసాములోనో నేర్పరులే
అభ్యుదయ, విప్లవాలలో అందరూ అగ్రజులే
అసమ వ్యక్తిత్వాలతో నెలరాడు చక్రవర్తులే
కొందరు భూమిపై గీతాల్ని వాతల్లా వేస్తారు
మరి కొందరు భూమి గుండెని చీల్చి జెండాలను ఎగురవేస్తారు
కొందరు విశ్వంతో మమేకమై గాలి శ్వాసతో బ్రతుకుతారు
వసుధైక కుటుంబములో సభ్యులమంటారు

కవి కావ్యంలా ధ్యానంలా కలిసుంటాడు
కృషితో ఋషియై కొత్తవేదాల్ని సృష్టిస్తాడు
యుద్ధంలో గీతాల్ని బోధనలో దోహేల్నిపంచుతారు
బ్రతికిన కావ్యం మొలచిన మెదడులో వృక్షమౌతుంది

కావ్య విత్తనం రాతి మీదనో రాక్షస గతిలో పడితేలుతుంది
మొక్క వృక్షంలా మారడానికి భూమి ప్రధానం
కవి రవిగా వెలగడానికి భావ జాగృతే ముఖ్యం
అందుకే నేను కవుల్ని చదివినప్పుడల్లా వేరైతాను

విశిష్ట

ఇదదే ప్రేమ

ఇదదే ప్రేమ
వెలుగులో మెరుపులా ఉంటుంది
రాత్రిలో వెలుగులా ఉంటుంది
వెలుగు చీకటుల సమైక్యతగా ఉంది

సమైక్యతలో ఐక్యత
ఐక్యతలో అసమము
అందరికి సమానంగా
అందరికి జీవంగా ఉంటుంది

దాపరికముండనిది
కళ్ళలో కనపడేది
శరీర పర్యంతము
తనదిగా ఏలుకొనేడిది

వెతికితే దొరకడానికి వస్తువు కాదు
శ్రమించకుండా లభించేది కాదు
శ్రమలో నిశ్శబ్దమై ఉంది
ప్రతి పనిలో తన వంతు నెరవేర్చుతుంది

విశ్వంలో వెలుగులా ఉంది
అంతట ఉనికిలా ఉంటుంది
శరీరంలో రక్తంగా
జీవితానికి సూత్రంగా ఉండేది ప్రేమ

విశ్వాంతారాల్లో అనంతమై
అద్దంలోని చంద్రుని ప్రతిబింబం
నివురు గప్పిన నిప్పులా ఉంది
ప్రతి హృదయంలో పవలిస్తుంది

ప్రేమలేని మనుషులు
చెవిటి అవిటివారు అంగవికలులు
అందుకే ప్రేమను పట్టుకోలేరు
ప్రేమించే వారు ప్రేమలో బ్రతుకుతారు

ప్రేమ ఒక దివ్యరూపం
దైవంలా మనలోనే ఉంటుంది
మనిషే ప్రేమ దేవాలయం
ప్రేమ జీవుల స్వభావం

ప్రేమలో నించే ఆనందం పుడుతుంది
ఆనందంలేని వారు ప్రేమలేనివారు
ప్రేమను వ్యతిరేకించే వారు జీవితాన్ని ఎరుగనివారు
ప్రేమ పరివర్తనకి పరిణామాలకి మూలం

హృదయాలను పంచుకొనేది
మనసులలోని విషాన్ని తీసి మమతలని నింపేది
అన్నింటికి ఆధారంగా ఆహ్వానించేది
ఇదదే ప్రేమామృతం

మధురం మానవత్వం

మనిషి మనిషి
మానవత మానవత్వం
మనస్తత్వ జీవి ప్రయాణం
మానవతా వాదం

మతం కులం
గతం యొక్క గమనం
వర్తమానంలో
మనిషితో గమనం మానవత్వం

గతిస్థితి
పరివర్తన భ్రమణం
ప్రకృతి ప్రపంచానికి
మూల సూత్రం

మూల మొక్కటే మనిషికి
మానవత్వమే దాని దారి
మనిషిని మనిషిగా గౌరవిస్తే
ప్రేమ, మమత, సమతలే ప్రయాణం

మిత్ర భావంలో
మానవత్వం పుడుతుంది
ఆచరణలో ఆరోగ్యంగా పెరుగుతుంది
విశ్వంలో మానవత్వం మధురమౌతుంది

కోరికలు

కోరికలు గడ్డిలా పుడుతున్నవి
నరనరాన పునాదులు కట్టుకొన్నవి
దేహంలో గృహాలను నిర్మించుకొన్నవి
శరీరాన్ని సామ్రాజ్యంగా ఏలుకొంటున్నవి

మెదడు వాహనం నుండి సవారి చేస్తుంటవి
మొండెంను పిచ్చిగా వాడుకొంటవి
పగలు రాత్రి లేకుండా పుట్టగొడుగులా పుట్టుకొస్తవి
శాంతి చెయ్యమని మదిలో పోరు చేస్తుంటవి

అక్షయ పాత్రల్లా ఇక్కడే కోరికలు పుడ్తవి
సప్త సముద్రాలు దాటి పయనిస్తొంటవి
విశ్వంలో శ్రేష్టుడివి కావాలని కలలు కంటవి
తమ వీధుల్లోనే గుర్తింపు లేకుండా బ్రతుకుతుంటవి

ఎడతెరిపి లేకుండా ఏకదాటిగా వస్తూ వెల్తుంటవి
హృదయంలో పూయలేని ఆగాదాలను సృష్టిస్తవి
రెక్కలు లేని పక్షిలాగా మనసు కొట్టుకుంటుంది
అనంతమైన ఆశల కోర్కెలు చౌరస్తాలో నిలబెడ్తవి

బ్రతుకు ప్రయాణం

జీవిత ప్రయాణానికి
రెండు మార్గాలు
ఒకటి అంతర్ యాత్ర
రెండు బహిర్ యాత్ర

అంతర్ యాత్రలో
అనువు నుండి అఖండము కెల్తుంది.
అంతం నుండి ఆరంభమవుతుంది
ఆది అంతం ఉండదు

బిందు నుండి సిందూ వరకు
మన్‌సూర్ యొక్క అనహలక్‌లా
బుద్ధుని తపదీపోభవలా
పరివర్తనా చక్రమై ప్రయాణిస్తుంది.

బహిర్ యాత్రలో
ఆరంభముంది అంతం ఉంది.

అశాశ్వతం శాశ్వతంగా ఉంటుంది.
పరివర్తనా ప్రయాణంగా ప్రపంచం నడుస్తుంది.

అశాశ్వత ప్రపంచంలో అహంకారాలు ఆడంబరాలు
కామ క్రోద లోభ మోహాలు, ఈర్ష్య ద్వేశాలు
అవిరళంగా ఆకర్షిస్తాయి
అజ్ఞానందకారంలో ముంచుతాయి

వర్తమానము వీడి గతం భవిష్యత్తుల గందర గోళంలో
మెదడును సర్వ గుణాల విపంచిని చేసి
సమాజానికి ఉరి వేసుకొంటుంది
తనలోని సాక్షిని మరచిపోతుంది

మనసుతో మమేకమైన సమాజంలో గుణంలేదు
ప్రపంచంలో ఇరుక్క పోయిన వాడికి వెలుగు లేదు
అందుకే అలగాజనం ఆకాశం క్రింద పెరుగుతుంది
అనవసర అనర్థాలకి భూమి నిలయమైంది.

కులకంపు

గుంటూరులో అది చుండూరు
సూర్యదస్తమించాడు చంద్రుడు దాక్కున్నాడు
కులతత్వపు చీకటి కోరలు కసి చూపించాయి.
అంధకారం మానవతను చుట్టుముట్టి మట్టిలో కలిపింది

నాల్గు దిక్కులనుండి చాతుర్వర్ణం మనుషుల్ని చుట్టుకుంది
కత్తులతో గొడ్డన్లతో మానవతను నరికింది
సంచులలో శవాలు నింపి
కాకులకు గద్దలకు ఊరు అప్పగించింది

అగ్రవర్ణం పోలీసులు ఒక్కటై వచ్చారు
హరి బిడ్డల గుండెల్లోని రక్తాన్ని తాగారు
కులతత్వం క్రూరంగా సకిలించింది
మానవతను మంట గలుప మరో ప్రయత్నం చేసింది

అసెంబ్లీ పార్టమెంట్‌ల నోర్లు అరుస్తున్నవి
ప్రతిపక్షాలు న్యూస్ పేపర్లు కేకలేస్తున్నాయి
రాజకీయ ముసుగులో కులం కంపు కొడుతుంది
ఇలాంటి కులకంపుతో దేశం నాశనమైతుంది

కులం కంపును చూసి కొత్త తరం నవ్వుతుంది
మనుషులలో మానవత ఏడుందని అడుగుతుంది
మత్తులోని జనంతో కులం మైధునం చేస్తుంది
మానవత్వం కులానికి సమాధి కట్టుతుంది

భూమి పుష్పాలు

పూర్వం నుండి అపూర్వంగా
దేశంలో విశిష్టంగా బ్రతికినవారు
అగ్నిలా ఆకలిమంటల్లో వెలుగుతూ
ప్రకృతికి పూసిన భూమి పుష్పాలు

చాతుర్వర్ణానికి ఆవల పంచములై
కులవ్యవస్థలో అట్టడగు వారై
మనుష్యుల్లో అంటరాని వారుగా
చరిత్రలో ఆదిమ జనులైనారు

ఆదిమం నుండి ఆధునికత వరకు
అగ్రకులాల చేతిలో పనిముట్టైనారు
ధనవంతుల ఆనందానికి హారతులు
బ్రతుకుల్లో విశ్రమించని శ్రమజీవులు

పరిశ్రమల్లో అమూల్య శ్రామికులు
పొలాల్లో నాగలిలా కూలిరైతులు
వ్యాపారస్తులకు బాడుగ బండ్లు
అగ్నిని అలుముకొని బ్రతికే జీవులు

చిట్టెడు గింజలకు అప్పు పడి
చెట్టంత జీవితాన్ని ధార పోసే వాళ్ళు
నడుము విరిగినా, నడక తగ్గినా
ఒంటెద్దు బరువుల్ని మోయువారు

బలహీనులకి తమ బలాన్ని జోడించి
బ్రతుకు గమ్యాలకు చేర్చుతారు
మురికి వాడల్లో మురిపాల్ని పంచుతూ
పక్షుల్లా గృహాల్లో బ్రతుకుతారు

కపట జనులెంత క్రూరంగా చూసిన
తమ వంతు బాధ్యతలను నిర్వహించుతారు
పశువుల కంటే హీనంగా చూసినా
గోదాంలాంటి హృదయం కలిగినవారు

ఆటపాటలతో ఆనందాన్ని చూస్తూ
శ్రమలోని సంతోషాన్ని పంచుకుంటారు
రోజు కూలైనా రాజుల్లా బ్రతుకుతూ
అన్ని మరచి హాయిగా నిద్రపోతారు

రాజకీయాలలో పేపరు ఓటర్లు
రాష్ట్ర రాజకీయాలలో బహుజనులు
కుటిల నీతులకు బలియైన జనులు
ప్రకృతి పరంగా బ్రతుకు భూమి పుత్రులు

సాంఘిక ఉద్యమాల ఊపిర్లు
విప్లవాలకు ఒడ్డుతారు ప్రాణాలు
అడ్డదారిన బోవు దొడ్డవారినైన
అవసరమైతే దుడ్లతో నేర్పుతారు పాఠాలు

తర తరాలకు సేవలందించినా
ఏ తరం నుంచి ఏమి ఆశించరు
మూర్తీభవించిన మానవతా విలువల విధేయులు
ఆనందంతో శ్రమను అర్పించుకుంటారు

విశ్వమందు ఉనికి ప్రాణమైనట్లు
పరివర్తనకు ప్రాణవాయువులు వీరు
మారే వ్యవస్థకు మైలురాళ్ళు
మారే మనుష్యులకు ముందు జ్యోతులు

దోపిడి ఆశయం

మా చెమటే
మీ ఆస్తిగా ఎన్నుకుంటే
మా రక్తనాళాలే
మీకు ఉరి తాళ్ళవుతవి
మా శ్రమ దోచుకోవడం
మీ పని అయితే
మిమ్ము సమాధి చేయడం
మా ధ్యేయం అవుతుంది

వెనుకబడ్డ బతుకులు

కూలోడా ! ఓ కూలోడా
బస్తాలు మోసేటోడా
బాసన్లు తోమేటోడా
పశువుల గాచేటోడా
పావురాల పెంచేటోడా కూలోడా! ఓ కూలోడా!

భూమిని దున్నేటోడా
భూమాతను నమ్మినోడా
చెరువు కట్ట కట్టినోడా
తూము కావలుండేటోడా
చెరువెనుక నీకు చేటంత భూమిలేదా!

చెప్పులు కుట్టెటోడా
వాడంతా ఊడ్చేటోడా
ఊరంతా చూసేటోడా
ఊరుబయట నీ ఇల్లు ఒంటరిగా ఉన్నదా!

బండలు చెక్కేటోడా
పునాదులు లేపేటోడా
ఇటుకలు చేసేటోడా
ఇల్లుగట్టి ఇచ్చేటోడా
కిరాయికి ఇల్లడిగితే నీ కులమేదని అడిగింద్రా!

అడవుల నరికేటోడా
బీట్లన్ని వేసేటోడా

బాడ బండి నడిపిటోడా
లారిమోత మోసేటోడా
గుడిసె కట్ట కట్టె తెస్తే పంచనామ చేసినాడా?

బుట్టలు నేసేటోడా
తట్టలను మోసేటోడా
దినమంతా కూల్జేసి
కలిగంజి త్రాగేటోడా
కంట్రాక్టరు నీ శ్రమలో సగభాగం మింగాడా!

కుండలు చేసేటోడా
చిప్పలంబలి త్రాగేటోడా
బిల్డింగు గుత్తపట్టి
గూన సప్లై చేసేటోడా
గూన కప్పు కొందామంటే గుడిసెకైనా దిక్కులేదా!

బట్టలు నేసేటోడా
మురికి బట్టలుతికేటోడా
బట్టకేసే గంజితాగి
దిన దినము గడిపేటోడా
కట్టు కోను బట్టలేక గోసి పేగు కట్టినావా!

పాములు పట్టేటోడా
పాలుపోసి పెంచేటోడా
కోడెనాగు కోరలను
కారుతోటి తీసేటోడా
తెగబలిసిన నల్లత్రాచు నీచెల్లెను చెరిచిందా?

క్షౌరాలు సేసేటోడా
గడ్డాలు గొరాగేటోడా
మదమెక్కిన శరీరాల
మాలీసు చేసేటోడా
కష్టమొచ్చి డబ్బు అడిగితే ముందుకు రమ్మన్నాడా!

భాగోత మాడేటోడా
నాటకాలు వేసేటోడా
కోతులకు సామునేర్పి
కోలాట మాడేటోడా
బూతు సినిమాలు నీ పోటికి నిలబడ్డాయా!

నీతాత ముత్తాతలు
మతం, కులం వృత్తియని
కూడు గుడ్డ గుడిసె లేక
ఈ మట్టిలో కలిసింద్రు
పాత బుద్దుల్ని పాతి పెట్టి క్రొత్త బాటనందుకోరా!

మను ధర్మ శాస్త్రాలు
కాల్చివేయబడ్డవి రా
కర్మం ఆచారాలు
కల్పిత పురాణాలేరా
భారత, రామాయణం విష వృక్షపు చెట్లు రా!

దళితులొస్తున్నారు

దళితులొస్తున్నారు
గతంలో గడించిన అనుభవాలతో
వర్తమానంలో ఉదయునిలా ఎదుగుతున్నారు
తూర్పు ప్రభంజనాలై విజృంభిస్తున్నారు

పూలే, అంబేడ్కర్‌ల ఆదర్శాలతో
బుద్ధ దేవుని మానవతా దారుల్లో
ఆంధ్రప్రదేశ్ నుండి ఆధునిక ప్రపంచానికి
అంతమెరుగని అనంతంలో అడుగులు వేస్తున్నారు

అంటరానితన మను పంజరంలో బ్రతికినోళ్ళు
గళం విప్పిన కలాలతో కదం తొక్కుతున్నారు
తమలోని శక్తుల్ని జ్యోతులుగా వెలిగించి
చీకటిని చీల్చి వెలుగురేకులైనారు

స్వచ్ఛమైన సత్యమైన మార్గాల్ని త్రవ్వుకుంటూ
సంఘటితమై ఒక్కటిగా ముందుకు వస్తున్నారు
దారిద్ర్యాన్ని రూపుమాప
దనమదాంధుల అణచివేయు కదం తొక్కారు

కళలన్నీ కలాలన్నీ ఒక్కటై లేసినవి
సమాజంలో చిక్కులను శాశ్వతంగా మట్టుబెట్ట
సృష్టికి ప్రతి సృష్టి చేస్తూ సృజనులు సజ్జనులు కలిసి ముందుకొచ్చారు
నూతన మానవత్వాన్ని తెస్తున్నారు

భారతదేశంలో

కులం కుంపటిలాగుంది
మానవత మలినమై మాడుతుంది
దారిద్ర్య రేఖ దేశంలో పెరుగుతుంది
భారతదేశం బ్రహ్మణత్వం నుండి బయట పడుతుంది

పురుషోత్తముడి నోటి జ్వాలలు
ద్విజులను దిగంబరులుగా చేస్తుంది
అగ్రవర్ణాలను అవర్ణులుగా చేస్తుంది
అణగారిన ప్రజల రోదనలు వినిపిస్తున్నవి

శంభూకుడి శిరస్సు వేదమై
ఏకలవ్యుడి బొటనవేలు తలరాతలు రాస్తుంది
విషనాగులకు దళితానుభూతులు చెపుతుంది
ధరణి పుష్పించే మార్గాలు చూపుతుంది

ఆధునిక భారతంలో
ఆరోగ్య వివేకంలో విజయముంది
కులం వెదజల్లిన విషానికి విరుగుడుగా
విశ్వమే వివేకికి సాక్షిగా ఉంటుంది

ప్రేమయే వెలుగు

మైడియర్ !

నన్ను యవ్వనం చుట్టేసింది
నరాలకు మొగ్గలు పుష్పించినవి
కాళ్ళు చేతుల ఊడలు మమేక మైనవి

కలలు ప్రణయ గీతాలైనవి
లైబ్రరీ వెన్నెలలు రథాన్ని నడుపుతున్నవి
పగలు సంతోషంతో ప్రవహిస్తున్నవి
రాత్రుళ్ళు నా బాహువుల్లో పవళిస్తున్నవి

ల్యాండ్ స్కేప్ గార్డెన్‌లోని నవ్వులు
పువ్వుల పొదరిల్లై పులకరిస్తున్నవి
నీ నడక నాట్యమూ
జ్ఞాపకాలై గమ్యాల్ని వెతుకుతున్నవి

హృదయ సాగరం వర్షపుజల్లుల్ని ఆహ్వానిస్తుంది
కాళ్ళ క్రింద భూమి తలక్రిందులవుతున్నట్లుంది
పేగుల రక్త ప్రసారం పెరిగింది
ఉచ్ఛ్వాసనిశ్వాసల్తో పరిణామాన్ని పొందుతుంది

నిన్ను తలచని క్షణమంటూ లేదు
క్షణాలు యుగాల్లా గడుస్తున్నవి
నీ నేత్రాలు నా ఊహల్లో సరస్సులైనవి
సరస్సులు పొంగి సముద్రాల్ని వెతుకుతున్నవి

నీ కాలి గజ్జెల పరుగుల సంగీతం
నా ఆలోచన ఆ పరుగునాపి ఎదుగుతున్నవి
గదిలోపెట్టిన నీ అడుగు సాగర శాంతినిచ్చినవి
అయితే ఏం ! ప్రేమలో ఏకమై నిరాకారమైనాం

అప్పుడు తెలిసింది
నీవు నడుస్తుంటే కోతుల్లా చూస్తూ
కాకుల్లా అరిచే వారెందరున్నా
నీవే సర్వం ఈ సమస్త సృజనకు

నీ సన్నని పెదవులు
లిప్‌స్టిక్ అందాలు మాత్రమే కాదు
ప్రేమ పుష్పాల చిలిపి సౌరభాలు
పెదవి విప్పితే తియ్యటి రత్నాలు

తరతరాలకి స్త్రీలే ఆరాధ్యులు
అన్ని రకాలుగా వెలిగే ప్రేమ దీపాలు
జీవితాన్ని వెలిగించే వెన్నెల వెలుగులు
స్త్రీలే నవప్రపంచ ప్రస్థానాలకు దారులు

ఇంకేమనుకోమన్నానో తెలుసా?
అందుకున్న వాడికి అరుణతారవు
తారలా విశ్వాన్ని వెలిగించే వెలుగు

పడక గది

రాత్రి పడక గది పవలించడానికి సజావుగా లేదు
పరివర్తనా కాలచక్రంలో భాగమైంది
పరుపు మంచం కసితో బుసకొడ్తుంది
గది నాలుగు గోడలు జైళ్ళను గోచరిస్తున్నవి

పక్కలో పడతి మగత నిద్రలో ఉంది
మనసులలో ఒక మూల మలినమై ఉన్నది
సంసారం మమ్మల్ని అదిమిపెట్టి తొక్కుతుంది
అనాచార సంస్కృతులకు బందీని చేసింది

పోరులోనే ప్రేమదాగి ఉన్నట్లుంది
మొహ మాటాల వలయంలో ముందుకెళ్తుంది
ఉన్నది ఉన్నట్లుగా ముడి విప్పితే తెలుస్తుంది
చిక్కులన్ని వీడిపోయి అచ్చు గుద్దినట్లుంది

పడక గది ప్రేమకు ప్రతి రూపంలా ఉంది
చీకటి గదిలా నెగిటివ్ ఫోటోను చూపుతుంది
జీవితంలో వాస్తవికతకు అద్దం పడుతుంది
ప్రేమించే హృదయాలను ఆనంద పరుస్తుంది

ఆకాశం నా ఇల్లు

కంటికి రెప్పలా ఆకాశం నాఇంటి కప్పు
డబ్బున్న వాల్లందరి కంటే నాకే పెద్ద ఇల్లు
ప్రకృతి పడకకు అస్థిత్వపు చల్లని గాలులు
చదువుకోవడానికి సూర్యచంద్రులు ట్యూబ్‌లైట్లు

అతిధులకు శిలలే సోపానాలు
స్నానమాడ నదుల ఏరుల్లో బాత్రూములు
నాలుగు దిక్కులు నా ఇంటి స్తంభాలు
భూమిపై పుట్టి ఆకాశానికెదిగిన వారు విశ్వ మానవులు

వెలుగు vs చీకటి

నిద్రనుండి లేస్తూ కళ్ళు వెలుగును వెతికినవి
వెలుగు చీకట్లు విడవలేనట్లుగా కలసి ఉన్నవి
చీకటివెలుగులపై కప్పిన నన్ను నిద్రగప్పింది
నిద్రలేవదు వెలుతురు లేనిది లేవనివ్వదు
వెలుతురుని వెతుకుతే నిద్రముంచుకొస్తుంది
నిద్ర చీకటి ఒక్కటై నన్ను అలుముకొన్నవి
దినం నిండుగా ఉండటానికి వెలుగును పిలుస్తుంది
వెలుతురు పెరిగిన కొలది చీకటి దూరమైతుంది
వెలుగు వెళ్లిపోకుండా చీకటి పొంచి ఉంది
అర్ధరాత్రి కళ్ళుతెరిస్తే వెలుతురు కనిపిస్తుంది
దీపంలో చీకటి వెలుగు మమేకమైంది
దీపాన్ని ఆరిపేస్తే చీకటి భయంకర రూపాన్ని దాల్చింది
వెలుగు చీకట్లది ఏమిటా ప్రేమభావమనిపిస్తుంది
ప్రేమకు తేడాలు ఉండవు
అన్నింట్లో తానే ఉన్నట్లుగా ఉంది
అదే అన్ని అయినట్లుగా ఉంది
అదే కనబడిన దేవుడిలా ఉంది

అన్వేషణ

నేను నేనుగా నేలపై పడుకుంటే
నేల నన్ను అలుముకొంటుంది
హత్తుకొనేది ఆరాధ్యమైతే
ఆకాశం వెయ్యి రేకుల్తో ఆహ్వానిస్తుంది

అయినా అనిశ్చిత పరిస్థితి ఆవరించి ఉంది
కాలు చేతులు కట్టెయ్యకుండానే కట్టబడినవి
మనస్సు ఆలోచన్ల దారాల్ని చుట్టుతూనే ఉంది
శరీరమంతా తెలియని తపనలో చుట్టబడుతుంది

అనారోగ్యం లేకుండానే నిర్వీర్యమవుతుంది
వీరత్వం వికసించకుండానే ఫలితాలకై చూస్తుంది
తేలిగ్గా ఎగిరేపక్షి రెక్కలను దించుకొంటుంది
కంటిరెప్పలో గాయం కలుక్కుమంటుంది

సమాజం చేసిన గాయం బొంగరంలా తిరుగుతుంది
పొద్దుతిరుగుడు పువ్వులా తిరిగే జీవితాల్ని కట్టేసిన
మూలమేదో తెల్సుకొనే అన్వేషణ మొదలైంది
అంతః కరణాలలో అన్వేషణ నా ఆయువైంది

నేలపై పడుకుంటే నేను భూమండలమైనాను
నాలో నేనన్వేషిస్తే విశ్వాన్నైనాను
సూర్యచంద్రులు నాలో చిట్టి బొమ్మలైనవి
నేను విశ్వంలో శూన్యమైనాను

తిమిరంతో సమరం

ఆ రాత్రంతా ఆలోచన్ల కురుక్షేత్రం
సమస్యల సాలెగూడులో జరిగింది సమరం
సవతులు శిఖలు పట్టుకొన్న సంబరం
మెదడు యుద్ధభూమిలో శరీరంహునం
పొడుచుకొస్తున్నా పిడిబాకుల్లా ఆలోచన్లు
సూర్యుడుదయిస్తే కాని చీకటి పోదు

టీకయ్య - టీకాలు

జీవితం

కొన్ని స్మృతులు
మరి కొన్ని జ్ఞాపకాలు
సృజనలు
శూన్య హస్తాలు

నీచుడు

ఆవుకు గడ్డి పెట్టకుండా
పాలు పిండేవాడు
పాపం పుణ్యం పేరున
మనుష్యుల్ని పీడించుక బ్రతికేవాడు

బాడ్‌కావ్

మగ అహంకారంతో
మగువలను అణిచేసి
కట్నాల కానుకలతో బ్రతుకుతారు
భాడ్‌కావ్ అంటే అలా బ్రతికేవాడని తెలుసుకోరు

బద్మాష్

చతురతతో
ఆలోచనల ముడులువేసి
మాటల్తో కోటలు కట్టేవాడు
మానిపులేషన్ చేసి బ్రతికేవాడు

ఫూల్

తప్పటడుగులు
వేస్తూనడక నేర్చుకోగలరు
అడగెయ్యకుండా నడవగలననువాడు
ఆశయాలకు ఆమడదూరంలో బ్రతికేవారు

ఇడియట్

మనుషుల్ని వేరు చేసి
మానవతకు కులం పూసి
కులం పేరుతో బలహీనుల్ని చేసి
బలహీనులపై ఆధారపడి బ్రతుకు వాడు

బోకస్

అవసరమున్న లేకున్న
ఆరుమేఘాలల సాగిపోవు ఆలోచనలు
ఆలోచన్ల చిక్కులో పడి
అనాదిగా మిగిలే బ్రతుకులు

స్కాండ్రల్

వచ్చిన అవకాశాలను కాదని
జీవితాంతం వాటికొరకు బాధపడువాడు
గతంలో తల దూర్చి గడ్డితింటూ బ్రతుకువారు
ఆధునికత ఎదురొచ్చిన అడ్డుదారులు వెతుకువారు

రాస్కెల్

ఎన్ని ఉన్నా
తృప్తిగా బ్రతుకని వారు
పైసా కొరకు
పది అబద్ధాలు ఆడువారు

స్టుపిడ్

అనవసరంగా
గొప్పలు చెప్పేవాడు
తన అసమర్థతను
అబద్ధాలతో దాచువాడు

టీచర్స్

స్వంత విజ్ఞానాన్ని
విద్యార్థులకు పంచడానికి ప్రయత్నిస్తారు
లేదా సిలబస్‌లో వెదుకుతారు
దొరకనపుడు సిలబస్ పాటిస్తారు

డబ్బు

చేతులను మార్చి చెడునంత రుద్దుకొని
మనుషులకు ఉరై మంగళసూత్రమై
అంటుముట్టుల రోగాలను అందరికి చుట్టుతూ
సుడిగాలిలా జీవితాలను ఉక్కిరి బిక్కిరి చేసేది

రాజకీయం

అసమర్థుల అహంకారం
అధికారంతో ధనం ఆర్జించాలని
గద్దె కొరకు కపట జ్ఞానము నేర్చి
కష్టపడకుండా ధనవంతులయ్యే మార్గం

హంసలు

ఆనందానికి ప్రతీకలు
ఓషో ఆశ్రమంలో వెలుగులు
మనుష్యుల్తో అడుగుల్లో అడుగేసి ఆడుతున్నాయి
జన జాగృతిలో విశ్వంతో మమేకమై బ్రతుకుతున్నాయి

స్మృతులు

ఊటలా మెదడులో కోరికలు
శరీరాన్ని నాగలిలా దున్నేస్తాయి
క్షణం క్షణం భూతంలా మనుసును పీడిస్తాయి
గడియలో తలపించి మురిపిస్తాయి
మెదడును తొలచి మెరుపులను కలిగించి మాయమవుతాయి

కన్ను

ప్రపంచాన్ని చందమామలా చూపించి
మనిషిని విశ్వాంతరాలకు పెంచుతుంది
విశ్వంతో చేతులు కలిపి స్నేహంగా ఉంటే
నువ్వే విశ్వమానవుడవని తెలుపుతుంది

మిన్ను

కంటికి పొరలా ఆకాశం నా ఇంటికప్పు
భవంతులలో నివసించే వారికంటే నాకే పెద్దఇల్లు
నా పడక గది వెలుగులు సూర్యచంద్రులు
మన్ను మిన్ను సుఖ నిద్రకు సోపానం

దవాఖానాలు

దవాఖానాలు రోగాల ఉత్పత్తి కేంద్రాలు
డాక్టర్లు ఉత్పత్తిని పెంచే కార్మికులు
దవాఖానాలు పెరుగుతుంటే రోగాలు పెరుగుచున్నవి
ఆధునిక యుగంలో ఇంటికో డాక్టరు అవసరముంది

మందులు

అనారోగ్యానికి మందులు అవసరం
ఆరోగ్యాన్ని పెంచేందుకే మందుల అనవసరం
అనవసరానికి అవసరాన్ని సృష్టించేది డాక్టర్లు
రోగాలను ఉత్పత్తి చేసి ఎరువులు మందులు

వ్యభిచారం

మనస్సులేని శరీరంపై మమకారం
శరీరంతో విటుడు చేసే అపచారం
డబ్బుతో దారిద్రాన్ని కొలువ
దేహాన్ని అమ్మి దేహీ అను గుణం

వేశ్య

కాగితం పువ్వులా కరిగించు మనసును
కలిమి కొరకు తన విలువ కట్టుకొనును
మమతలేని దేహంను మనుషుల కప్పగించి
కామకేళీలకు శరీరాన్ని కాల్చుకొనును

లంజకొడుక

తల్లి చెప్పితే కాని
తనయుడికి తెలువదు తండ్రి ఎవరో
లంజ కొడుకా అని ఇతరులను నిందింప
తమదేమి గ్యారెంటీ తల్లీ తనయ

కడుపు

పుట్టుకతో కడుపులో పురుటి నొప్పులు కలుగును
పుడమిలో బాధలకు కడుపు మండు చుండును
శక్తిని ఉత్పత్తి చేయు కడుపు మణిపుర
కల్మషములు లేనప్పుడు కవ్వించును నవ్వించును

భాష

భాష మాటల గొడుగులది
భావం హృదయ తరంగాలది
భాషా భావం వ్యక్తిత్వాలను పురికొల్పేది
భాషాతత్వం మనుషులని విడగొట్టేది

డాక్టర్స్

ఆరోగ్యమేమిటో తెలువని అజ్ఞానులు
రోగాలు విసుగుతో మానవత్వం పై కసిగా బ్రతుకుతారు
రోగాలభివృద్ధికి క్లినిక్కుల దుఖాన్లు పెడతారు
రోగాలు లేకుంటే నిరుద్యోగుల్లా రోడ్లపై పడతారు

నర్సులు

తెల్ల కొంగల్లా రోగాల సరస్సులోని పక్షులు
వార్డు వార్డుల్లో తిరుగు రోగాల పంతులమ్మలు
రోగాల్తో రోగాల నంటుకొని ఉండే సేవికలు
రోగస్తులను ఆదరించే అమ్మలక్కలు

ముత్తయి మాన్యాలు

ఎఱుక

ఎల్లప్పుడు
వెలిగే వెలుగులా
క్షణ క్షణంల ప్రభావిత పరివర్తనం
దేహం దేవాలయంలోని సాక్షి "ఆత్మ సాక్షాత్కారం"

వర్తమానం

ఈ క్షణం సమస్థం
విశ్వాసానికి వర్తమానం సర్వస్వం
వర్తమాన పరివర్తనమే
ప్రపంచానికి ప్రాణం

ధ్యానం

నేనెవర్ని అనే ప్రశ్నకు
సాక్షియై సమాధానం కనుకొనే స్థితి
మౌనంలో కేంద్రీకృతమై
ఎరుకతో వెలిగే దీపం

నిశ్శబ్దం

నిర్గుణ నిరాకారం
అణువు నుండి అఖండము వరకు
ప్రపంచములో ప్రశాంతమయి
విశ్వమంత తనైంది

అమృతం

చికాకుల చిక్కుల
మనస్సుకు మమతల కళ్ళెం వేసి
శరీర సాక్షిగా ఆత్మ జ్ఞానం పొంది
తనువు నుండి తను వేరైన మధుర క్షణం

ఆనందం

మిథ్యా ప్రపంచంలోను
ప్రకృతి పురుషుడిలో పరవశించి
పరమాత్ముడి శరీరంలో మమకారమై
పరిమళంలో బ్రతుకు జీవితం ఆనందం

దివ్య

విశ్వంలో

ఓంకార ప్రకాశం

పంచేంద్రియాలతో ప్రభు అనుభూతిని పొంది

దైవాను గ్రహం పొందిన దివ్యానుభూతి

ప్రేమ

శ్రద్ధా భక్తితో

పంచే పెంచే బాంధవ్యాలు

అవగాహనతో అనురాగాలను అల్లిన

తేనెలాంటి మనసుకు పూచిన పువ్వు

జాగృతి

జగతిలో ప్రగతిలో

దేహం దేవాలయంలో

జీవిత రథ చక్రాలకు విరుసు

నిరంకార స్వరూపానికి నిలువెత్తి అద్దం

జీవితం

అనుభవాలతో ఆకాశం వైపు
సృజనాత్మకతలో సూర్యుడిలా
ప్రపంచంలో పరమాత్ముడైన
విశ్వంలోని విరాట్ రూపం

అధ్యాత్మికత

తన నుండి మొదలైన అధ్యాయం
తనువులోని ఆత్మారామంతో
నిర్గుణ దామంలో నిరంకారుడై
విశ్వ చైతన్యంతో మమేకం కావడం

సమాధి

శరీర సహాయంతో
ఆత్మ సాక్షాత్కారాన్ని పొంది
శరీరాన్ని సాక్షిని విడిచి
నిర్మలానందాన్ని పొందడము

మత్తయి

మట్టి మనిషి మత్తయి
మట్టి నుండి వచ్చాడు
మట్టిలోకే మాయమైతాడు
మట్టి ముద్ద శరీరం నుండి మాట్లాడుతాడు

మట్టి ఉత్పత్తులు ఆహార దాన్యాలు
శరీర పోషణకు స్వీకరిస్తాడు
భూమి భోజనం రక్తాన్ని ఇస్తుంది
గాలియే ప్రాణవాయువైంది

అగ్ని నీరు ఆరోగ్యనిస్తే
ఆకాశం భూమి ఉన్నతి నిచ్చాయి
అన్ని కలిపి మనిషిని చేస్తే
మనిషి మహిలో మహాత్ముడు

జీవితం విరాట్ స్వరూపం
సముద్ర మంత విశాలం
తనెవరో తెలుసుకుంటే సర్వం
అది లేకుంటే నిసర్గం.

తనను తాను గౌరవిస్తే
ఇతరులను గౌరవిస్తాడు

తనలో తాను ప్రేమైతే
ఇతరులకు తన ప్రేమను పంచుతాడు

తనలో ఏముంటే
దానినే పంచుతారు
ఏమియు లేకుంటే
భిక్షగానిలా బ్రతుకుతారు

సాక్షి సాదృశ్యుడు
సామ్రాట్టులా బ్రతికేవాడు
ఎరుకలో జగతిని ఎఱుగుతాడు
మౌనంలో మాన్యాలు తిలకిస్తాడు

ధ్యానంలో
సప్త చక్రాల ద్వార
సమాధి దశను పొందుతాడు
ఆత్మ సాక్షాత్కారమైతాడు
అస్తిత్వానికి ప్రాణమైతాడు.

సిద్ధయ్య సుద్దులు

విశ్వమంత విశాలమైనది జీవితం
ప్రపంచమును తనలో జీర్ణించుకుంటే
అనుభవము విరాట్ రూపమౌతుంది.
భూమి ఆకాశాలను తనలో కలుపుకొని విశ్వమౌతుంది.
బిందూ నుండి సిందూ వరకు
జీవితం ప్రవహించేనది లాంటిది.
ప్రవాహంలో కష్ట సుఖాలు కలిసి వస్తాయి.
జీవితానీ ఎదురీదగలిగిన వారు
జీవిత సత్యాల్ని కనుకొంటారు
సమైఖ్య జీవనంలో సజీవులౌదురు.
ప్రేమలో జీవించేవారు
జీవితంలోని ఖజానాని పంచుకొంటారు
సుగంధంలో బ్రతికేవారు
ప్రభుతో మమేకమై ఉంటారు
ఈర్ష్యతో బ్రతికే వారు
ఇతరులను సాధిస్తారు
ఈర్ష్యాగ్నిలో తమను తాము కాల్చుకుంటారు.

ద్వేషించే వాళ్లు తమ దేహాన్ని మరచిపోతారు.
ఆత్మ అజ్ఞానంలో బ్రతుకుతారు
ఇతరులతో కయ్యాలను పెంచుకుంటారు.
కామంతో బ్రతికే వారు ప్రేమలోని కోమలత్వాన్ని కనుక్కోలేరు
శరీరక వాంచలకు బానిసలైతారు
క్రోధంలో బ్రతికే వారు తమకు తామే హాని చేసుకుంటారు.
లోభి తను బ్రతకడు, వేరే వాళ్ళు సుఖపడుతుంటే చూడలేదు.
మోహం క్షణభంగురం,
మోహంలో చిక్కుకున్నవాడు, పంజరంలో చిక్కిన పక్షిలా కొట్టుకుంటాడు.
కామ, క్రోద, లోభం, మోహం, ఈర్ష్య ద్వేషాలను విడువని వారు
మానవత్వానికి మచ్చలా మిగిలిపోతారు.
జీవితంలో కష్టాలు రావడం సహజం వచ్చిన కష్టాలకు
పరిష్కారం కనుగొనడం జ్ఞానమార్గం
జ్ఞానం యోగం ఎరిగినవాడే నిత్యానందజీవి.
సిద్ధాంతాలను వదిలేసిన వాడే సిద్దయ్య
సత్‌చిత్ ఆనంద్

నిశ్శబ్ధంలోని శబ్ధం

ఓషో ఓషో !

ఓంకారం

అస్తిత్వంతో

మమేకమైన రూపము

శ్వాస శ్వాసలో

సాక్షాత్కారము

సాక్షి భావంలో

నిరంకార రూపము

ప్రేమకు

స్వయం సముద్రుడు

స్నేహానికి

సౌహార్ధ హృదయం

జీవితంలో

ఆనందమయం

దశదిశల జ్ఞానమై

వెలుగుతున్న నిరంకారం

విశ్వానికి
బ్రహ్మ జ్ఞానం
సృజనాత్మకతకి
విరాట్ రూపము.

ఓంకార్
సత్‌నామ్
అనంత వాణి
అంతర్ వాణి

నిశ్శబ్దంలోని శబ్దం
విశ్వ సంగీతం
సరిగమల సారం
అస్తిత్వం యొక్క అనంతరూపం.